

కమలాపురంలో రైల్వే వంతెనకు మళ్లీ భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి (ఫైల్)

మాట ఇచ్చారు.. మడత పెట్టేశారు

జగన్ ప్రతిపక్ష నాయకుడి హోదాలో అనేక హామీలు ఇచ్చారు. మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే సమస్యలు తీరుతాయని చెప్పుకొచ్చారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, కొత్త పరిశ్రమలు తీసుకొస్తామని నమ్మబలికారు. చెన్నూరులో మూతపడిన చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తామంటూ జనాలను నమ్మించారు. ఎమ్మెల్యే అభ్యర్థులు కూడా ప్రచారానికి వెళ్లిన ప్రతి చోటా ఇవే హామీలు గుప్పించారు. జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టడంతో ఇచ్చిన హామీలు అమలు అవుతాయనుకున్నారు. అయితే ఐదేళ్ల కాల చక్రం గిర్రున తిరిగింది, ఇచ్చిన హామీలు నెరవేరలేదు. వెరసి 2019 ఎన్నికల్లో ఏ సమస్యలున్నాయో అవే సమస్యలు మళ్లీ కనిపిస్తున్నాయి. చెన్నూరు షుగరు ఫ్యాక్టరీని తిరిగి పునఃప్రారంభిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఐదేళ్ల కిందట చెన్నూరు షుగరు ఫ్యాక్టరీ ఉండేది. అయితే ఇప్పుడు అక్కడ ఉన్న సామగ్రి పాత ఇనుప సామాన్ల వాళ్లకు అమ్మేశారు. మళ్లీ మాకు ఓట్లు వేయమని జగన్ అండ్ కో జనాల వద్దకు వెళుతున్నారు. 2019 ఎన్నికల్లో సీఎం జగన్, ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి ఇచ్చిన హామీలను గుర్తు చేసుకుంటే..




2022 డిసెంబరు 23న వివిధ అభివృద్ధి పనులకు శిలాఫలకం ఆవిష్కరించిన సీఎం జగన్



సర్వరాయసాగర్ ప్రాజెక్టు



తెరుచుకోని చెన్నూరు షుగరు ఫ్యాక్టరీ



పుష్పగిరి పుణ్యక్షేత్రం

- షుగరు ఫ్యాక్టరీ తెరిపిస్తానంటూ ప్రైవేటుకు విక్రయం
- కొప్పర్తిలో పరిశ్రమలంటూ గొప్పలు
- కమలాపురంలో ఆర్ఓబీని భూమిపూజతో సరిపెట్టారు
- సర్వరాయసాగర్‌ను సీఎం సిమెంటు పరిశ్రమకు.. ఎమ్మెల్యే చేపల చెరువుకే పరిమితం చేశారు
- ఐదేళ్లయినా అమలు కాని హామీలు
- మళ్లీ ఓట్ల కోసం జగన్ అండ్ కో జనాల వద్దకు..
- ఇదీ కమలాపురం నియోజవర్గంలో పరిస్థితి



ఆగిపోయిన బెంగళూరు రైల్వే లైను

(కడప-ఆంధ్రజ్యోతి): చెన్నూరు షుగరు ఫ్యాక్టరీని తెరిపిస్తాం, రైతులకు బకాయిలు ఇచ్చి మళ్లీ రైతులకు పూర్వవైభవం తీసుకువస్తాం. వైసీపీ అధికారంలోకి వస్తే చెన్నూరులో మూతపడిన చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తామని ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి 2010లోనే తనను కలిసిన కార్యకర్తలకు హామీ ఇచ్చారు. ఇక జగన్ సీఎం అయిన తరువాత 2019 జూలైలో జమ్మలమడుగులో జరిగిన బహిరంగ సభలో చెన్నూరు ఫ్యాక్టరీ మూతపడకుండా ఉండేందుకు రూ.60 కోట్లు మంజూరు చేస్తున్నాం, అక్కడ కో ఆపరేషన్ ప్లాంటు ఏర్పాటు చేస్తాం, చెరుకు పిప్పి ద్వారా విద్యుత్ తయారు చేసి ఫ్యాక్టరీ వాడుకునేందుకు చేస్తాం. దీని వల్ల మరికొంత మంది యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయి. ఇథనాల్ తయారీ కోసం మరో ప్లాంటు ఏర్పాటు చేస్తాం.. ఎట్టి పరిస్థితుల్లో మూతపడనివ్వం అంటూ హామీ ఇచ్చారు. రైతులు కూడా ఫ్యాక్టరీ తెరుచుకుంటుందనుకుని సంతోషించారు. అయితే గతేడాది ఫ్యాక్టరీ మిషనరీని వేలం వేయగా, చెన్నైకి చెందిన ఒక కంపెనీ రూ.9 కోట్లకు దక్కించుకుని అమ్ముకుంది.

ఇండస్ట్రియల్ హబ్‌గా కొప్పర్తి

కొప్పర్తి పారిశ్రామికవాడను ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చి 2.50 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని సీఎం జగన్ చెప్పుకొచ్చారు. రూ.700 కోట్లతో వసతులు కల్పించనున్నట్లు హామీ ఇచ్చారు. పలు అభివృద్ధి పనులకు 2022 డిసెంబరు 23న శంకుస్థాపనలు చేశారు. నిజంగానే ఇక్కడికి పరిశ్రమలు వస్తాయని కలలు కన్నారు. పెద్దపెద్ద కంపెనీలు వస్తు న్నట్లు జగన్ పత్రికలో ప్రత్యేక కథనాలు రాసుకున్నారు తప్ప వారు చెప్పిన కంపెనీలు ఒక్కటీ రాలేదు. డిక్షన్ కంపెనీ మాత్రమే కార్యకలాపాలు సాగుతుండగా.. మిగతా చిన్న పరిశ్రమలు శంకుస్థాపనకే పరిమితమయ్యాయి. ఇక 2.50 లక్షల ఉద్యోగాలు అన్న మాటలకు మడత పెట్టేశారు. కమలాపురంలో సీఎం జగన్ రూ.35 కోట్లతో నిర్మించిన ఆర్‌ఓబీకి 2022 డిసెంబరు 23న శంకుస్థాపన చేశారు. ఇదే ఆర్‌ఓబీని చంద్రబాబు హయాంలో శంకుస్థాపన చేయగా.. జగన్ దానిని రద్దు చేసి అధికారంలోకి వచ్చిన మూడేళ్ల తరువాత శంకుస్థాపన చేశారు. అయితే మళ్లీ ఈ పనులకు గతేడాది డిసెంబ రులో ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి భూమిపూజ చేశారు. మేనల్లుడు సీఎం జగన్ స్టీలు ఫ్యాక్టరీకి రెండుసార్లు కొబ్బరికాయలు కొట్టిన విధంగా ఈ ఆర్వోబీ కోసం ఎమ్మెల్యే రవీంద్ర నాథరెడ్డి రెండోసారి భూమిపూజ చేశారు.

కమలాపురం, ఖాజీపేట మార్గంలో పాడేరు వంకపై వంతెన అని చెప్పి హామీని గాలికొదిలేశారు. కమలాపురంలో రూ.85 కోట్లతో బైపాస్ రోడ్ల నిర్మాణం పనులు సాగుతూనే ఉన్నాయి. ఇక కమలాపురంలో రూ.36 కోట్లతో చేపట్టిన ఓపెన్ డ్రైనేజీ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో మురికి అంతా రోడ్లపైనే ఉంటోంది.

వల్లూరు మండలంలో...

ప్రముఖ పుణ్యక్షేత్రం పుష్పగిరి ఆధ్యాత్మికంగా చారిత్రకంగా ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉంది. ఇక్కడ భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనం చేసుకుంటారు. అయితే వర్షాకాలంలో పుష్పగిరికి వెళ్లాంటే నది దాటి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉండేది. తీగ వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారు. దానిని మడత పెట్టేశారు. ఆదినిమ్మాయపల్లె ఆనకట్టపై బ్యారేజీ కడతా మని హామీ ఇచ్చారు. ఈ మేరకు డిటైల్ ప్రాజెక్టు రిపోర్టు పంపారు. అంచనా వ్యయం, ఇతర అంచనాలన్నీ పూర్తి స్థాయిలో రిపోర్టు తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తే దాన్ని అటకెక్కించారు. బ్యారేజీ కార్యరూపం దాల్చి ఉంటే తాగునీటి సమస్య ఉండేది కాదు. ఇక మండల కేంద్రమైన వల్లూరులో సరైన రోడ్లు లేవు. మురుగునీరంతా రోడ్లపై ప్రవహిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు తాగేందుకు శుద్ధి జలాలు లేకపోవడంతో మినరల్ వాటర్ కొనుక్కుని దాహం తీర్చుకుంటున్నారు. చెన్నూరులో జాతీయ రహదారి నిర్మాణం అసంపూర్తిగా ఉంది. రోడ్లు దెబ్బతిన్నా పట్టించుకునేవారు లేరు. రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి ఇంకా ఇళ్లు కేటాయించలేదు. చెన్నూరులో డ్రైనేజీ లేక అవస్థలు పడుతున్నారు.

వీరపునాయునిపల్లెలో...

సర్వరాయసాగర్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి 25వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని గొప్పలు చెప్పారు. 25 వేలు కాదు కదా 25 ఎకరాలకు కూడా సాగు నీరు అందించలేదు.

గాలేరు-నగరి, సుజల-స్రవంతి పథకంలో భాగంగా నర్రెడ్డి శివరామిరెడ్డి 2004లో పనులు చేపట్టారు. 3.6 టీఎంసీల సామర్థ్యంతో కుడి ఎడమ కాల్వ నిర్మించారు. అధికారంలోకి వస్తే ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెప్పుకొచ్చారు. కుడి కాల్వ భూసేకరణ ఉంది. డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ కూడా లేవు. రూ.212 కోట్లతో పిల్ల కాల్వల నిర్మాణానికి ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి భూమిపూజ చేసి సరిపెట్టేశారు. అయితే ఇక్కడి నుంచి సీఎం జగన్‌కు చెందిన భారతి సిమెంటు కర్మాగారానికి, ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డికి చెందిన చేపల చెరువులకు మాత్రమే నీళ్ల వదులుతున్నారు. ఈ ప్రాజెక్టుతో రైతులకు ఎలాంటి ఉపయోగం లేకుండాపోయింది. వీరపునాయునిపల్లె దాహం తీర్చేందుకు రూ.120 కోట్లతో పాపాఘ్నిలో నీటి పథకం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే ఆ పనులు మొదలు కాలేదు. ఇక వీరపు నాయునిపల్లె అంతా మురుగు కాల్వలు లేక ఇబ్బందులు పడుతున్నారు. జీఎన్‌ఎస్‌ఎస్ ద్వారా సాగు నీరిస్తామని చెప్పారు. అదీ ఎత్తిపోయింది.

పెండ్లిమర్రిలో...

కడప-బెంగుళూరు రైలు మార్గం పెండ్లిమర్రికే పరిమితమైంది. మండలంలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. తిప్పిరెడ్డిపల్లె, గంగనపల్లె రోడ్లు దెబ్బతినడంతో జనం అవస్థలు పడుతున్నారు.

సీకేదిన్నెలో...

బుగ్గవంక ప్రాజెక్టు అధ్వానంగా తయారైంది. చెట్లు పెరగడంతో బలహీన పడింది. కడప నుంచి ఎర్రముక్కపల్లె మీదుగా ఆర్వోబీ లేక జనాలు అవస్థలు పడుతున్నారు. గ్రామ సచివాలయం, ఆర్‌బీకే మరో భవనాన్ని నిర్మించి ఇదే అభివృద్ధి అంటూ మహాత్మాగాంధి కలలు కన్నవి నెరవేరాయంటూ గొప్పలు చెప్పుకోవడం తప్ప ఇచ్చిన హామీలకే దిక్కు లేకుండా పోయింది.

ఇది మాత్రం చేసేశారు

అధికారంలోకి వస్తే ఇచ్చిన హామీల సంగతి దేవుడెరుగు.. భూకబ్జాలు, ఇసుక, గ్రావెల్ దందాకు తెర లేపారు. కావాలసినంతా బొక్కేశారు. కమలాపురం నియోజకవర్గం భూకబ్జా లకు అడ్డాగా మారింది. ప్రభుత్వ భూములను అసైన్‌మెంటు కమిటీ పేరిట ఇష్టారాజ్యంగా వైసీపీ నేతల పేరిట ఎక్కించుకున్నారు. వీఎన్‌పల్లె, పెండ్లిమర్రి మండలాల్లో వైసీపీ నేతలకే భూములు ఇచ్చారు. విలువైన కొండలు, భూములన్నీ ఆక్రమించేసుకున్నారు. ఇక పాపాఘ్ని, పెన్నా నదుల నుంచి ఇసుకను అడ్డంగా తోలేసి కోట్లు గడించారు. వల్లూరులో విలువైన భూములు కాజేశారు. కడప నగర శివారుల్లోనే సీకేదిన్నె, వల్లూరు, చెన్నూరు మండలాలు ఉన్నాయి. ఈ రెవెన్యూ పరిధిలో భూములకు మంచి ధరలు ఉన్నాయి. రికార్డులన్నీ ట్యాంపరింగ్ చేసేసి భూములు కాజేశారనే ఆరోపణలున్నాయి. ఇక సీకేదిన్నె చుట్టూ వాగులు, వంకలు, కోట్లాది రూపాయలు విలువైన ప్రభుత్వ భూములు మింగే శారు. ఇక సీకేదిన్నె, పెండ్లిమర్రి పరిధిలో గ్రావెల్ కొల్లగొట్టి కోట్లాది రూపాయలు గడించారు. కమలాపురం ఎమ్మెల్యే సీఎం జగన్ మేనమామ రవీంద్రనాథరెడ్డి.. వరుసకు చిన్నాన్న, ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డిలు వీరిద్దరే నియోజకవర్గాన్ని శాసించారు. ఇదే అదనుగా వీళ్ల అనుచరులు మట్టి నుంచి మనీ, ఇసక నుంచి తైలం తీసి కోట్లు కొల్లగొ ట్టారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక భూములు అయితే కనిపించినవన్నీ మావే అన్నట్లుగా కబ్జా చేశారనే విమర్శ ఉంది.

- నేటి నుంచి 25 వరకు నామినేషన్ల ప్రక్రియ
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 17: సాధారణ ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరు సహకరించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం ఎన్నికల గజిట్ నోటిఫికేషన్ విడుదల నేపథ్యంలో బుధవారం ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌తో కలసి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలకు సంబంధించి ఏప్రిల్ 18న గజిట్ నోటిఫికేషన్ విడుదల కానుందని.. 25వ తేదీ వరకు రోజు 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల లోగా నామినేషన్లు దాఖలు చేసుకోవాలన్నారు. 26న నామినేషన్ల పరిశీలన, 29వ తేదీ ఉపసంహరణ ఉంటుందన్నారు. మే 13వ తేదీ పోలింగ్ ప్రక్రియ, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతాయన్నారు. సెలవు రోజులలో నామినేషన్లు స్వీకరణ ఉండదన్నారు. జిల్లాలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని సదుపాయాలు కల్పించామని తెలిపారు.

లోక్‌సభ నియోజక వర్గానికి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్, ఎన్నికల అధికారి నామినేషన్లు స్వీకరిస్తారు. నియోజకవర్గాల కేంద్రాల్లో శాసనసభ నియోజక వర్గానికి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్‌లను అందజేయాలన్నారు. ఒక్కో అభ్యర్థి నాలుగుసెట్లు నామినేషన్ పత్రాలను దాఖలు చేయాలన్నారు. గుర్తింపు పొందిన రాష్ట్ర, జాతీయ పార్టీలో పోటీ చేసే అభ్యర్థికి అదే నియోజకవర్గంలో ఒక ఓటరు ప్రతిపాదిస్తే సరిపోతుందన్నారు. స్వతంత్ర అభ్యర్థికి అయితే 10 మంది ఓటర్లు ప్రతిపాదించాలన్నారు. ఎన్నికల నిర్వహణ ఖర్చుల కింద జీరో అకౌంట్‌తో కొత్తగా బ్యాంకు అకౌంట్ తెరవాలన్నారు. పార్లమెంటరీకి పోటీ చేసే అభ్యర్థి రూ.25 వేలు, ఎస్సీ ఎస్టీలకు రూ.12,500లు, అసెంబ్లీకి రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.5 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలన్నారు. నామినేషన్ సమయంలో నోటరీ, అఫిడవిట్ సమర్పించాలని.. అందులో అభ్యర్థి ఆస్తి తదితర వివరాలన్నీ సరైనవిగా ఉండాలన్నారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో రిటర్నింగ్ అధికారి వెంట నలుగురికి మాత్రమే అనుమతి ఉందన్నారు. అభ్యర్థి నామినేషన్‌ను సువిధ పోర్టల్‌ని ఉపయోగించి ఇ-అఫిడవిట్‌ను దాఖలు చేసిన, డాక్యుమెంట్లను ఆర్వోకు తప్పనిసరిగా సమర్పించాలని తెలిపారు. ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లా సరిహద్దుల్లో, చెక్‌పోస్టుల వద్ద గట్టి భద్రతా చర్యలు చేపట్టామన్నారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నామన్నారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ స్పందన హాల్‌లో సమావేశం నిర్వహించి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను వివరించారు. ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలన్నారు.

20న కడప ఎంపీ స్థానానికి షర్మిల నామినేషన్

- ఇందిరమ్మ రాజ్యం మళ్లీ రావాలి : తులసిరెడ్డి
- నేటి నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్నాం
- నాన్నను కిరాతకంగా నరికి చంపిన వారికి ఓటు వేయొద్దు : సునీత




పులివెందుల, ఏప్రిల్ 17: కడప పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీ అభ్యర్థిగా వైఎస్ షర్మిల 20వ తేదీ నామినేషన్ దాఖలు చేస్తోందని.. ఈ కార్యక్రమానికి అందరూ తరలిరావాలని పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పులివెందులలోని మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి ఇంట్లో డాక్టర్ సునీతతో కలిసి తులసిరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ మళ్లీ అటు దేశంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. ఇందిరమ్మ రాజ్యం వస్తేనే అటు దేశం ఇటు రాష్ట్రం అభివృద్ధి చెందుతాయన్నారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడం దివంగత వైఎస్ఆర్ కోరిక అన్నారు. అలాగే షర్మిలను కడప ఎంపీగా చూడటం మాజీ మంత్రి వివేకానందరెడ్డి చివరి కోరిక అన్నారు. ఈ రెండు జరగాలంటే కాంగ్రెస్ పార్టీ ఇటు రాష్ట్రంలోను, అటు దేశంలోను పూర్తి మెజార్టీతో గెలవాలన్నారు. రాష్ట్రంలో పేట్టేది కొంచెం అయితే... దోచుకునేది ఎక్కువ అన్నారు. బటన్ నొక్కి సంక్షేమ పథకాలు అందిస్తున్నానని జగన్ చెబుతున్నారు. కానీ పన్నుల పేరుతో అంతకు మూడింతలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. దేశంలో ఉన్న సీఎంలలో 2019 అఫిడవిట్ ప్రకారం జగన్‌కు రూ.373 కోట్లు ఉన్నట్లు ప్రకటించారన్నారు. కానీ ఎన్నికల ప్రచారంలో మాత్రం ఆయన పేదవాడినని, పత్రికలు లేవని, టీవీ ఛానళ్లు లేవని చెప్పడం దారుణమన్నారు. నవరత్నాల్లో ఒకటైన జగనన్న ఇళ్లు ఏ మేర కట్టించారో అందరికి తెలుసు అన్నారు. రాష్ట్రం విషయం పక్కనపెడితే కేవలం ఒక్క పులివెందుల నియోజకవర్గంలో జగనన్న ఇళ్లు పరిశీలిస్తే 7079 ఇళ్లు మంజూరైతే 310 ఇళ్లు పూర్తిచేశారంటే ఆయనకు ఉన్న చిత్తశుద్ధి ఏమిటో ఇట్టే అర్థమవుతుందన్నారు. వైసీపీ పాలనలో పులివెందులలో అరాచక శక్తులు రాజ్యమేలుతున్నాయన్నారు. ఇవన్నీ పోయి మళ్లీ ఇందిరమ్మ రాజ్యం రావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం మాజీ మంత్రి వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీత రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తరపున గురువారం నుంచి ప్రచార కార్యక్రమం ప్రారంభిస్తున్నామన్నారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డిని అతికిరాతకంగా గొడ్డలితో నరికి చంపిన హంతకులకు ఓటు వేయొద్దని కోరుతామన్నారు. వైఎస్ షర్మిలకు ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో సీతారామ లక్ష్మణులు

దేవతలారా.. దీవించండి

- ప్రారంభమైన కోదండరాముడి బ్రహ్మోత్సవాలు
- వైభవంగా ధ్వజారోహణం
- రామాలయానికి పోటెత్తిన భక్తులు
- ముత్యాల తలంబ్రాల తయారీలో శ్రీవారి సేవకులు
- ఏర్పాట్లను పరిశీలించిన టీటీడీ జేఈవో, జేసీ



ధ్వజారోహణం చేస్తున్న వేదపండితులు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 17: ఆంధ్ర అయోధ్య ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 10.30 నుంచి 11 గంటల మధ్య గరుడపటాన్ని ప్రతిష్ఠించి కంకణభట్టర్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణం చేశారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ధ్వజస్తంభం వద్ద నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గరుడ ధ్వజపటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి గరుడ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, నేత్రోన్మీలనం చేశారు. ధ్వజస్తంభం నమస్కారం, నవసిద్ధి బలిపక్షణం, ధ్వజస్తంబానికి నవకలశ పంచామృతాభిషేకం చేసి రాగతాళ నివేదన ద్వారా ఇంద్రాద్రి సకల దేవతలను, నవగ్రహాలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించినట్లు వివరించారు. ఈ సందర్భంగా వేదపండితులు చతుర్వేద పారాయణం నిర్వహించారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో టీటీడీ సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ జగదీశ్వర్‌రెడ్డి, ఆలయ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, వీజీవో బాలిరెడ్డి, అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తులకు తాగునీరు, మజ్జిగ పంపిణీ

కోదండరాముడి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లను చేసింది. పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలు టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసింది. ఎండవేడిమిని తట్టుకునేందుకు వీలుగా భక్తులకు క్యూలైన్‌లో తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను ప్రత్యేక సిబ్బంది ద్వారా పంపిణీ చేశారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు నిరంతరాయంగా తాగునీరు, మజ్జిగ అందిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో ఎండ వేడిమి నుంచి భక్తులకు ఇబ్బంది లేకుండా జర్మన్ షెడ్లు, కూలర్లు ఏర్పాటు చేశారు.

కల్యాణానికి తలంబ్రాలు తయారీ

కోదండరాముడి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 22న జరగనున్న సీతారాముల కల్యాణం కోసం ఆలయంలో బుధవారం తలంబ్రాల తయారీ కార్యక్రమాన్ని చేపట్టారు. తలంబ్రాల ప్యాకెట్ల తయారీని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవంలో ఎంతో ప్రాముఖ్యత ఉన్న ముత్యాల తలంబ్రాల ప్యాకింగ్‌ను శ్రీవారి సేవకులతో ప్రారంభించినట్లు తెలిపారు.

ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్ద గల పీఏసీ వద్దకు తీసుకొచ్చారన్నారు. పీఏసీ హాలులో బియ్యం, పసుపు, నెయ్యి కలిపి తలంబ్రాలు తయారు చేస్తున్నట్లు చెప్పారు. తలంబ్రాలతో పాటు ముత్యం, కంకణం ఉంచి ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లాలతో పాటు కర్నూలు, రాజమండ్రి నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో సేవలందించేందుకు శ్రీవారి సేవకులు వచ్చినట్లు ఆయన తెలిపారు. దాదాపు 300 మంది శ్రీవారి సేవకులు 1.20 లక్షల తలంబ్రాల ప్యాకెట్లను తయారు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్వీబీసీ సీఈవో షన్ముఖ కుమార్, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఐ-2 జగదీశ్వర్‌రెడ్డి, వీజీవో బాలిరెడ్డి, డిప్యూటీ ఈవోలు ప్రశాంతి, హరికృష్ణ, గుణభూషణ్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలన

సీతారాముల కల్యాణోత్సవం రోజున భక్తుల కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లను టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ కలిసి బుధవారం పరిశీలించారు. జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని భక్తులకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు గ్యాలరీలు, వసతులు, ఇతర ఏర్పాట్లపై జిల్లా అధికారులతో చర్చించారు. కడప జిల్లా ఎస్పీతో సమన్వయం చేసుకుని పోలీసులు, టీటీడీ విజిలెన్స్ సిబ్బంది పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వాహనాల పార్కింగ్, భక్తుల అవసరాలకు తగినన్ని ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. కల్యాణ వేదిక వద్ద బారికేడ్లు, అన్న ప్రసాదం కౌంటర్లు, లైటింగ్, వైద్య శిబిరాలు, మరుగుదొడ్లు, అదనపు పారిశుధ్య సిబ్బంది తదితర అంశాలపై సమీక్షించారు. అంతకుముందు ఒంటిమిట్ట ఆలయం వద్ద గల పరిపాలనా భవనంలో జేఈవో టీటీడీ, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అదనపు ఎస్పీ వెంకటరాముడు, సీఐ పురుషోత్తంరాజు ఇతర అధికారులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన కోదండరామాలయం



నామినేషన్లకు సబ్ కలెక్టరేట్ సిద్ధం

● నిబంధనలు వెల్లడించిన రిటర్నింగ్ అధికారి



నాలుగు కౌంటర్లతో నామినేషన్ స్వీకరించే రిటర్నింగ్ అధికారి గది వద్ద పూర్తి చేసిన ఏర్పాట్లు

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 17: మదనపల్లె నియోజకవర్గం (164 అసెంబ్లీ నియోజకవర్గం)కు సంబంధించి సాధారణ ఎన్నికల నామినేషన్ పర్వానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక సబ్‌కలెక్టరేట్‌లోని కోర్టు హాలులో నామినేషన్ల స్వీకరణకు రిటర్నింగ్ అధికారి, నలుగురు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో కౌంటర్లను ఏర్పాటు చేశారు. దీంతో పాటు నామినేషన్ ప్రక్రియ మొత్తం పూర్తిగా వెబ్‌క్యాస్టింగ్ చేసేందుకు సీసీ కెమెరాలు, టీవీలు ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హరిప్రసాద్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. ఆదివారం సెలవు రోజు తప్ప మిగిలిన రోజుల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. అభ్యర్థితో పాటు నలుగురిని మాత్రమే నామినేషన్ హాల్లోకి అనుమతిస్తామన్నారు. అభ్యర్థి ఫారం-26 అఫిడవిట్‌తో పాటు అవసరమైన పత్రాలు జత చేయాల్సి ఉంటుందన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఒక్కొక్క ప్రతిపాదకులు, బలపరిచేవారు ఉండాలని, స్వతంత్ర్య అభ్యర్థులు పది మంది ప్రతిపాదకులు, బలపరిచేవారు ఉండాలన్నారు. నామినేషన్ ప్రక్రియ మొత్తం వీడియో, సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటుందని, వెబ్‌క్యాస్టింగ్ కూడా ఉంటుందన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 4 గంటలకు పబ్లిక్ డొమైన్‌లో, నోటీసు బోర్డులో నామినేషన్‌లకు సంబంధించి వివరాలు అందుబాటులో ఉంచుతామన్నారు. సబ్‌కలెక్టరేట్ ప్రధాన ద్వారం నుంచి 100 మీటర్ల వరకు నిషిద్ధ ప్రాంతంగా పరిగణిస్తామన్నారు. డీఎస్పీ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తారని ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్‌వోలు రమాదేవి, బాలాజి రాజు, శ్రీనివాసులు, ప్రమీల పాల్గొన్నారు.

ఐదుగురికే అనుమతి : ఆర్‌ఓ



రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు

జమ్మలమడుగు, ఏప్రిల్ 17: నామినేసన్లు వేసేందుకు అభ్యర్థి సహా ఐదుగురికే అనుమతులు ఉంటాయని రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. బుధవారం జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 18వ తేదీ గురువారం నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల పక్రియ కొనసాగుతోందన్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేశామన్నారు. నామినేషన్ కోసం వచ్చే అభ్యర్థి వంద మీటర్లలోపు గేటు వద్ద ఆగాలని అక్కడి నుంచి అభ్యర్థి సహా ఐదుగురికి మాత్రమే లోనికి అనుమతి ఉంటుందన్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు నామినేషన్లు వేయాల్సి ఉంటుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి జనరల్ కేటగిరీ వారికి రూ.10 వేలు చలానా, నగదు రూపంలో కానీ నామినేషన్ వేసే చోట ఇవ్వవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీలకైతే అయిదు వేలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. అభ్యర్థులు రాష్ట్రంలో ఎక్కడివారైనా వారికి ప్రతిపాదన చేసే వారు సుమారు పది మంది స్థానికులే ఉండాలన్నారు. నామినేషన్లు ఆన్‌లైన్ ద్వారాకూడా వేయవచ్చని ఆయన తెలియజేశారు.

నరకదారులు...

● వైసీపీ ప్రభుత్వంలో రోడ్లన్నీ ఛిద్రం
● ఒక్క రోడ్డుకు మరమ్మతులు చేయలేదు
● అధికారుల అలసత్వం.. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం
● నిధులు లేక ఆగిన రోడ్ల పనులు
● అవస్థల్లో వాహనదారులు, ప్రయాణికులు
● నాలుగేళ్లుగా సాగుతున్న రాయచోటి-సుండుపల్లె, రాయచోటి-సానిపాయి రోడ్ల పనులు
● పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



కంకర తోలి అలాగే వదిలేసిన రాయచోటి-సుండుపల్లె రోడ్డు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 17: జిల్లా పరిధిలోని ఇటు రాయచోటి నియోజకవర్గం, అటు రాజంపేట నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ఆ రెండు రోడ్ల పనులు అధికారుల అలసత్వం.. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా నాలుగు సంవత్సరాలుగా జరుగుతూనే ఉన్నాయి దీంతో ప్రయాణికులకు, వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. నరకానికి దారులుగా మారిన రాయచోటి-సుండుపల్లె, రాయచోటి-సానిపాయి రోడ్ల పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియక ఈ ప్రాంతాల ప్రజలతో పాటు ప్రయాణికులు, వాహనదారుల్లో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నాలుగు సంవత్సరాల క్రితం రాయచోటి-సుండుపల్లె రోడ్డుతో పాటు రాయచోటి- సానిపాయి రోడ్లను డబుల్ లేన్‌లుగా మార్చాలని సంకల్పించింది. రాయచోటి నుంచి సుండుపల్లె వరకు డబుల్ లేన్ రోడ్డు నిర్మాణానికి రూ.40 కోట్లు, రాయచోటి-సానిపాయి రోడ్డు మార్గంలోని షికారుపాలెం నుంచి సానిపాయి వరకు డబుల్‌లేన్ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.20 కోట్లు నిధులు మంజూరు చేస్తూ ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా పనులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే నాలుగు సంవత్సరాల క్రితం ఆ పనులను పొందిన కాంట్రాక్టర్లు అధికారుల అలసత్వాన్ని, ప్రజాప్రతినిధుల అండదండలను ఆసరాగా తీసుకుంటూ రోడ్డును ఒకవైపు ఉంచి మరోవైపుకు చివర వరకు పనులు చేయకుండా రోడ్డు ఎక్కడ పడితే అక్కడ కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తూ ప్రయాణికులు, వాహనదారుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. ముఖ్యంగా రాయచోటి-సుండుపల్లె మార్గంలోని కుమ్మరపల్లి సమీపంలో కూడా ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్లు ఎక్కడ పడితే అక్కడ పనులను చేస్తూ రోడ్డుపై కంకర తోలి అలాగే వదిలేయడంతో పాటు అనుంపల్లె అటవీ ప్రాంతంలో అటవీ అనుమతులు లేవంటూ పనులను పూర్తి చేయకుండా అలాగే వదిలేయడంతో వర్షాలకు రోడ్డుకిరువైపులా కోతలకు గురై బస్సులు, వాహనాలు తొలగాలంటేనే నానా అవస్థలు పడే పరిస్థితులు అక్కడ నెలకొన్నాయి. అందులోనూ ఒకవైపు నుంచి రోడ్డు పనులు పూర్తిగా చేయకుండా వారికి ఎక్కడ సులభతరంగా ఉంటే అక్కడ పనులు చేస్తూ కష్టతరంగా ఉన్నచోట, కల్వర్టులు ఉన్న చోట అలాగే వదిలేయడంతో ఆ రోడ్డులో ప్రయాణించాలంటేనే ప్రయాణికులకు నరకం కనబడుతోంది. దీనికి తోడు అటవీశాఖ అనుమతులు వచ్చినప్పటికీ అటవీ ప్రాంతంలో రోడ్డు పనులు చేపట్టకపోవడంతో అక్కడ సింగిల్ రోడ్డు వలన వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక శిబ్యాల సమీపంలో ఈదుల వంకపై ఉన్న పాత కల్వర్టు స్థానంలో కొత్త బ్రిడ్జిని ఏర్పాటు చేసే క్రమంలో పిల్లర్స్ వేసి అలాగే వదిలేయడం వలన పాత బ్రిడ్జి ఎప్పుడు కూలుతుందో తెలియక ప్రయాణికులు, వాహనదారులు బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నాలుగు సంవత్సరాలుగా రోడ్డు పనులు సక్రమంగా చేయకుండా అక్కడక్కడా కంకర తోలి అలాగే వదిలేయడం వలన రాత్రి సమయాల్లో వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు.

అలాగే రాయచోటి-సానిపాయి మార్గంలోని షికారుపాలెం నుంచి సానిపాయి వరకు డబుల్‌లేన్ రోడ్డు పనులు నాలుగు సంవత్సరాలుగా సాగుతూనే ఉన్నాయి. ఆ మార్గంలో శీతంపేట వద్ద కొంత దూరం జంగంపల్లి వద్ద కొంత దూరం సానిపాయి సమీపంలో కొంతదూరం అక్కడక్కడా రోడ్డు పనులు చేపట్టి మిగిలిన చోట్ల కంకర తోలి అలాగే వదిలేయడం వలన వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. అలాగే షికారుపాలెం నుంచి శీతంపేట వరకు మూడు కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం వలన రోడ్డుకు ఇరువైపులా వర్షానికి సింగిల్ రోడ్డు కోతకు గురికావడంతో బస్సులు క్రాస్ అయ్యే సమయంలో ఇబ్బందులు పడుతూ డ్రైవర్లు వాహనాలను నడపాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అంతేగాక కొత్తరోడ్డు, కొత్తపల్లి, కంకర మిషన్ ప్రాంతాల్లో కంకర తోలి అలాగే వదిలేయడం వలన ఆ ప్రాంతంలో ప్రయాణికులతో పాటు ద్విచక్రవాహనదారులు కూడా ఆ దారిన ప్రయాణించాలంటే హడలెత్తిపోతున్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంతో పాటు ఆర్‌అండ్‌బీ అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం వలన ఈ రోడ్లలో ప్రయాణించాలంటే నరకం చూడక తప్పడం లేదని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు. నిర్దేశించిన గడువులోగా కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయకపోయినప్పటికీ వారిని తొలగించి ఆ స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించకుండా ఆర్‌అండ్‌బీ అధికారులు కూడా తమకు ఎందుకు వచ్చిన తంటలే అనే విధంగా వ్యవహరిస్తుండడంతో ప్రయాణికులు వాహనదారులే తిప్పలు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులతో పాటు అధికార పార్టీ నేతలు ప్రత్యేక చొరవ చూపి నరకదారులుగా మారిన రాయచోటి-సుండుపల్లె, రాయచోటి-సానిపాయి రోడ్ల నిర్మాణం పనులను పూర్తి చేసి ప్రమాదాల బారి నుంచి తమను కాపాడాలంటూ ప్రయాణికులతో పాటు వాహనదారులు, ఆర్టీసీ బస్సుల డ్రైవర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

> వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క రోడ్డు పని కూడా పూర్తి చేయలేదు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్లే తప్ప ఈ ప్రభుత్వ హయాంలో ఒక్క రోడ్డుకు మరమ్మతులు చేసిన పాపాన పోలేదని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. గతుకుల రోడ్లలో ప్రయాణించాలంటేనే వాహనదారులు, ప్రజలు హడలెత్తిపోతున్నారు. ఎప్పుడే ప్రమాదం జరుగు తుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఆర్‌అండ్‌బీ డీఈ వివరణ

జిల్లా కేంద్రమైన రాయచోటి పరిధిలోని రాయచోటి-సుండుపల్లె, రాయచోటి-సానిపాయి మార్గాల్లోని డబుల్ లేన్ రోడ్ల పనులు ఆలస్యంగా జరుగుతున్న విషయంపై ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటసుబ్బయ్యను వివరణ కోరగా పనులకు సంబంధించి ఆరు నెలల క్రితం కొంతమేరకు పార్ట్ బిల్లులు చెల్లించడం జరిగిందన్నారు. మిగిలిన పనులకు సంబంధించి నిధులు రాకపోవడంతో పనులు ఆగిపోయాయని తెలిపారు. అలాగే సుండుపల్లె రోడ్డు, సానిపాయి రోడ్ల మార్గంలోని అటవీ ప్రాంతంలో కూడా రోడ్ల నిర్మాణానికి అనుమతులు కూడా వచ్చాయన్నారు. నిధులు మంజూరైన వెంటనే ఆ రోడ్ల పనులను పూర్తి చేసి ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.





రాయచోటి-సానిపాయి రోడ్డులో కంకర తోలి అలాగే వదిలేసిన దృశ్యం, రాయచోటి-సుండుపల్లె మార్గంలోని శిబ్యాల వద్ద పిల్లర్లు వేసి అలాగే వదిలేసిన బ్రిడ్జి, అనుంపల్లె అటవీ ప్రాంతంలో కోతకు గురైన రాయచోటి-సుండుపల్లె రోడ్డు

మోగనున్న ఎన్నికల నగారా

● నేటి నుంచి 25 వరకు నామినేషన్లు
● కడప పార్లమెంటు అభ్యర్థులు కలెక్టరేట్‌లో..
● అసెంబ్లీ అభ్యర్థులు ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో
● 20న షర్మిల నామినేషన్
● పులివెందుల అసెంబ్లీ నుంచి 25న జగన్ నామినేషన్
● టీడీపీ, వైసీపీ అభ్యర్థుల జాబితా సిద్ధం



కడప, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టమైన నామినేషన్ల ప్రక్రి య గురువారం నుంచి మొదలు కానుంది. నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఉదయం 11 నుంచి ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈమేరకు జిల్లా ఎన్నికల అధికారి అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ విజయరామరాజు ప్రకటించారు. ఇక సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను వైసీపీ, టీడీపీ ఇప్పటికే ప్రకటించింది. కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. కడప పార్లమెంట్ నుంచి టీడీపీ అభ్యర్థిగా భూపేష్‌రెడ్డి పోటీ చేస్తుండగా వైసీపీ నుంచి సిట్టింగ్ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పోటీ చేయనున్నారు. ఇక కాంగ్రెస్ నుంచి వైఎస్ షర్మిల పోటీ చేస్తున్నారు. పార్లమెంట్‌కు పోటీ చేసే అభ్యర్థులు కడపలోని కలెక్టరేట్‌లో నామినేషన్లను దాఖలు చేయాల్సి ఉంది. ఇక అసెంబ్లీ అభ్యర్థులు ఆయా ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో నామినేషన్లను దాఖలు చేయనున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం ఓటర్లు 16,21,760 మంది ఉన్నారు. ఈ సంఖ్య ఇంకా పెరగనుంది.

నేటి నుంచి నామినేషన్లు

నోటిఫికేషన్ విడుదల	16.3.2024
నామినేషన్ దాఖలు	18.4.2024,
ఆఖరు తేది	25.4.2024
నామినేషన్ల పరిశీలన	26.4.2024
ఉపసంహారణ	29.4.2024
అదే రోజు పోటీ అభ్యర్థుల ప్రకటన	
పోలింగ్ తేది	13.5.2024
కౌంటింగ్	04.6.2024

నామినేషన్లు...

ఒక్కో అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చు. గుర్తింపు పొందిన రాష్ట్ర లేదా జాతీయ పార్టీ అభ్యర్థి కోసం అదే నియోజకవర్గం నుంచి ఒక ఓటర్ ప్రతిపాదిస్తే సరిపోతుంది. గుర్తింపు లేని పార్టీ, స్వతంత్ర్య అభ్యర్థి పోటీ చేస్తే అదే నియోజకవర్గం నుంచి పది మంది ప్రతిపాదించాలి. నామినేసన్ దాఖలు చేసే సమయంలో రిటర్నింగ్ అధికారి 100మీటర్ల దూరం పరిధిలోకి మూడు వాహనాలను మాత్రమే అనుమతిస్తారు.

నామినేషన్లు ఎక్కడెక్కడంటే...

కడప పార్లమెంటుకు సంబంధించి కలెక్టరేట్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లోని సి-బ్లాక్‌లో నామినేషన్ దాఖలు చేస్తారు. కడప, బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు అసెంబ్లీ స్థానాలకు కు సంబంధించి ఆర్డీఓ కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరిస్తారు. అలాగే కమలాపురం, ప్రొద్దుటూరు, మైదుకూరుకు సంబంధించి తహసీల్దార్ కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరిస్తారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది. ఇక ఎంపీగా పోటీ చేసే అభ్యర్థులు జనరల్ అభ్యర్థులు అయితే రూ.25వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12500 దరావత్తు చెల్లించాల్సి ఉంటుంది. ఎమ్మెల్యేకు పోటీ చేసే జనరల్ అభ్యర్థులు రూ.10, ఎస్సీ, ఎస్టీలు అయితే రూ.5వేలు దరావత్తు చెల్లించాలి.

అభ్యర్థులు సిద్ధం

సార్వత్రిక ఎన్నికల్లో తలపడే అభ్యర్థులను టీడీపీ, వైసీపీ ప్రకటించింది. కూటమి పరంగా జమ్మలమడుగు, బద్వేల్‌ను బీజేపీకి కేటాయించగా మిగిలిన చోట్ల టీడీపీ బరిలో ఉంది. ఇక వైసీపీ సిట్టింగ్‌లందరికి మళ్లీ టికెట్ ఇచ్చింది. ఇక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల కడప పార్లమెంట్ నుంచి పోటీచేస్తున్నారు. ఈనెల 20న నామినేషన్ దాఖలు చేయనున్నారు. బద్వేల్ అసెంబ్లీ అభ్యర్థిగా విజయజ్యోతిని ప్రకటించారు. పొత్తుల్లో భాగంగా కమలాపురంను సీపీఐకి కేటాయించారు. ఇంకా కడప, పులివెందుల, మైదుకూరు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఇక నామినేషన్లు వేసేందుకు పోటీలో ఉన్న అభ్యర్థులు ముహూర్తబలాలు చూసుకొని నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. జాతకం ప్రకారం రెండుమూడు సెట్లు నామినేషన్లు వేయనున్నారు. సీఎం జగన్ ఈనెల 25న పులివెందుల అభ్యర్థిగా నామినేషన్లు దాఖలు చేయనున్నారు. అదేరోజు పులివెందులలో బహిరంగ సభ పెట్టనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఇక హోరాహోరీ

నామినేషన్ల ఘట్టం ప్రారంభమవడంతో ఇక అభ్యర్థులు హోరాహోరీ ప్రచారాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్‌లు ఎన్నికల ప్రచారాలను నిర్వహిస్తున్నాయి. మేమంతా సిద్ధం పేరుతో ప్రొద్దుటూరులో సభ నిర్వహించారు. చంద్రబాబునాయుడు ప్రొద్దుటూరులో బహిరంగ సభ నిర్వహించారు. వైఎస్ షర్మిల కడప నియోజకవర్గాల్లో బస్సుయాత్ర చేపట్టి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇప్పటికే అగ్ర నేతలు జిల్లాలో తొలివిడత ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇక నామినేషన్ల తర్వాత మరోమారు అగ్రనాయకులు జిల్లాకు రానున్నారు. బీజేపీ తరఫున కేంద్ర మంత్రులు ప్రచారానికి వస్తున్నారని చెబుతున్నారు. అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తించనున్నారు.

జన చైతనం

రాష్ట్రంలో కూటమిదే విజయం

● 24న రాజంపేటలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ బహిరంగ సభ
● టీడీపీ జోనల్ ఇన్‌చార్జ్ దీపక్‌రెడ్డి వెల్లడి



విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ జోనల్ ఇన్‌చార్జి దీపక్‌రెడ్డి, చిత్రంలో జగన్‌మోహన్‌రాజు, సుగవాసి

రాజంపేట, ఏప్రిల్ 17: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అటు ఎంపీ, ఇటు ఎమ్మెల్యే స్థానాలన్నింటినీ స్వీప్ చేస్తుందని తెలుగుదేశం పార్టీ జోనల్ ఇన్‌చార్జి దీపక్ రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం రాజంపేట టీడీపీ కార్యాలయంలో టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంతో కలిసి విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 24 పార్లమెంటు స్థానాలు ఎన్‌డీఏ కూటమి కైవసం చేసుకుంటుందని సర్వేలు వచ్చాయని, మిగిలిన స్థానాన్ని కూడా గెలుచుకుని మొత్తం స్వీప్ చేస్తామన్నారు. ఈనెల 24వ తేదీ రాజంపేట టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం నామినేషన్ దాఖలు చేస్తున్నారని, అదేరోజు సాయంత్రం టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ రాజంపేట ఎన్నికల బహిరంగ సభలో ప్రసంగిస్తారన్నారు. రాజంపేటలో చిన్నచిన్న ఇబ్బందులను సర్దుబాటు చేశామని, టికెట్లు ఆశించి రాని వారంతా ప్రచారంలో పాల్గొని అధినేత ఆదేశాలకు అనుగుణంగా పార్టీ అభ్యర్థిని గెలిపించుకుంటారన్నారు. రాజంపేటలో అసంతృప్తికి తావు లేదన్నారు. టీడీపీ అధినేత ప్రకటించిన సుగవాసి బాలసుబ్రమణ్యంను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని ఆశించిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజుకు ఆయన సేవలను గుర్తించి సముచిత స్థానం ఇస్తామని తెలిపారు. జగన్‌మోహన్‌రాజు పార్టీ కోసం ఎంతో పాటుపడ్డారని, ఈ విషయం పార్టీ గుర్తించిందని, ఆయన కృషికి తగ్గట్టు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. రాజంపేటలో వైసీపీ నేతలు ఇప్పటికే భారీ ఎత్తున టీడీపీలో చేరారని, తిరిగి పెద్దఎత్తున కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, పార్టీ ప్రధాన నాయకులు, ఎంపీటీసీలు అధినేత వద్ద పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారన్నారు. టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ పార్టీ ప్రకటించిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని ఎక్కడ చూసినా టీడీపీ ప్రభంజనం బలంగా వీస్తోందన్నారు. సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంపై ప్రజలు విసిగిపోయారని, తాను ఎక్కడ పర్యటించినా నియోజకవర్గ ప్రజలు పార్టీలకతీతంగా ఆదరిస్తున్నారని, ఆదరించి నీరాజనాలు పలుకుతున్నారని, విజ్ఞులైన ప్రజలందరూ తనను భారీ మెజారిటీతో గెలిపిస్తారని వెల్లడించారు. తాను 24వ తేదీ బుధవారం నామినేషన్ దాఖలు చేస్తున్నానని, అదేరోజు సాయంత్రం టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ రాజంపేటలో జరిగే బహిరంగసభలో ప్రసంగించనున్నారని ఈ కార్యక్రమాలకు ప్రజలు వచ్చి తమను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయం ఎదురుగా ముస్లింల బైఠాయింపు



జమ్మలమడుగు వైసీపీ కార్యాలయం ముందు గేటువద్ద బైఠాయించిన ముస్లింలు

జమ్మలమడుగు, ఏప్రిల్ 17: స్థానిక వైసీపీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కార్యాలయం ఎదురుగా గేటు వద్ద జమ్మలమడుగు ముస్లింలు బైఠాయించారు. బుధవారం రాత్రి 7 గంటల నుంచి 7.35 గంటల వరకు బాధితులు కార్యాలయం వద్ద ఉన్నారు. వారు మాట్లాడుతూ మంగళవారం మైలవరం మండలం దొమ్మరనంద్యాల గ్రామం కొత్తమసీదు సమీపాన జమ్మలమడుగుకు చెందిన గౌషియా మసీదు పీఠాధిపతిపై వైసీపీ నేత, కౌన్సిలర్ ముల్లా జానీ అసభ్యకర వాఖ్యలు చేశారని వారు ఆరోపించారు. ఇందుకు సంబంధించి వైసీపీ కార్యాలయం వద్ద బైఠాయించినట్లు తమ పీఠాధిపతిపై అనవసరమైన వాఖ్యలు చేయడాన్ని ప్రశ్నించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధీర్‌రెడ్డికి చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, వైసీపీ నేత మల్కిరెడ్డి హనుమంతరెడ్డి తదితరులు ముస్లింలతో పీఠాధిపతి శిష్యులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పినట్లు బాధితులు తెలిపారు. ముల్లాజానీతో మాట్లాడి క్షమాపణ చెప్పిస్తామని, ఒకవేళ చెప్పకపోతే పార్టీ నుంచి ఆయనను సస్పెండ్ చేస్తామని చెప్పినట్లు పీఠాధిపతి శిష్యులు తెలిపారు. దీంతో అక్కడి నుంచి అంతా వెళ్లిపోయారు. సమస్యను తెలుసుకున్న వైసీపీ కార్యాలయం వద్దకు అర్బన్ పోలీసు స్టేషన్ సిబ్బంది ఎస్‌ఐ సుబ్బారావు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. సమస్య నియోజకవర్గమంతా వ్యాపించినట్లు తెలుస్తోంది. ఈ సమస్యకు పరిష్కారం గురువారం పరిష్కరిస్తామని చెప్పినట్లుగా బైఠాయించిన వారు తెలిపారు.

హామీలు బారెడు.. అమలు జానెడు

- సాక్షాత్తు సీఎం జగన్ హామీలకే తిలోదకాలు
- మళ్లీ గెలిపించాలంటూ వైసీపీ ఇంటింటి ప్రచారం
- ఇచ్చిన హామీల అమలు ప్రశ్నార్థకమే...
- ఇదీ బద్వేలు నియోజకవర్గ దుస్థితి

(కడప-ఆంధ్రజ్యోతి): సాక్షాత్తు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు రూ.500 కోట్ల అభివృద్ధి అయితే జరిగిన పనులు మాత్రం రూ.47 కోట్లు మాత్రమే. ప్రతిపక్ష నేత హోదాలో చాంతాడంత హామీలు ఇస్తే ముఖ్యమంత్రి అయ్యాక అమలుకాక పోవడంతో హామీలు బారెడు... అమలు అన్నట్లుగా తయారైంది. 2004 నుంచి బద్వేలు నియోజకవర్గంలో కాంగ్రెస్, వైసీపీ అభ్యర్థులే గెలుస్తూ వచ్చారు. ఇక 2019, 2022లో జరిగిన ఉప ఎన్నికల్లో సైతం వైసీపీ అభ్యర్థే గెలుపొందారు. అయితే ప్రతిపక్ష నేత, సీఎం హోదాలో ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోక అటు జనం, ఇటు రైతులు అవస్థలు పడుతున్నారు. అధికారంలో ఉండి ఐదేళ్లు ఏం చేయలేకపోయారు. మళ్లీ ఇప్పుడు వైసీపీనే గెలిపించాలంటూ ఇంటింటి ప్రచారం చేస్తున్నారు ఇదేం చోద్యమని ముక్కున వేలేసుకుంటున్నారు ఓటర్లు.



బద్వేలులోని మహ్మద్‌కాలనీ రోడ్డు దుస్థితి

సోమశిలకు ఎగనామం

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా తయారైంది బద్వేలు, గోపవరం పరిస్థితి. గోపవరం పక్కనే సోమశిల ప్రాజక్టు ఉంది. ప్రాజెక్టు నిర్మాణం కోసం గోపవరం మండలంలో ఊర్లన్నీ ఖాళీ చేశారు. అయితే చెంతనే నీరున్నా చుక్క కూడా ఉపయోగించలేని పరిస్థితి. సోమశిల నీటిని బద్వే లు పెద్దచెరువుకు నింపితే బద్వేలు, గోపవరం మండలాలకు సాగు, తాగునీటి సమస్య తీరుతుందని ఎప్పటి నుంచో ఆ ప్రాంతీయుల కల. సోమశిల నీటి కోసం ఆందోళనలు, పాదయాత్రలు, ఉద్యమాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే విజయమ్మ విజ్ఞప్తి మేరకు సోమశిల ప్రాజెక్టు నుంచి బద్వేలుకు నీరు ఇచ్చేందుకు 2018లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక జీఓ ఇచ్చారు. పనులు పట్టా ఎక్కుతున్న సమయంలో సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. నాడు ప్రతిపక్ష నేత హోదా లో జగన్ బద్వేలు నాలుగురోడ్ల కూడలి బహిరంగసభలో మాట్లాడుతూ మన ప్రభుత్వం వచ్చిన వెంటనే సోమశిల నుంచి 2 టీఎంసీలు కాదు 5 టీఎంసీల నీటిని ఇస్తానని జనం సాక్షిగా హామీ ఇచ్చారు. అన్నట్లుగానే జగన్ సీఎం అవడంతో ఇక సోమశిల వాటర్ వస్తుందని జనం భావించారు. ఐదు టీఎంసీల నీరు వస్తే గోపవరం, బద్వేలులో సుమారు 25వేల ఎకరాలకు అటు నేరుగా, ఇటు బోరుబావుల ద్వారా నీరందుతుందని రైతులు సంతోషించారు. నాలుగురోడ్ల కూడలిలో జనం సాక్షిగా ఇచ్చిన హామీకి జగన్ మంగళం పాడించి ఎత్తిపోతల పథకాన్ని ఎత్తి సోమశిలలో పడేశాడు.

రూ.500 కోట్లతో బద్వేలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన

2021 జూలై10న ఉప ఎన్నికల వేళ నియోజకవర్గంలో రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నాం అంటూ సీఎం జగన్ ప్రకటించారు. దీంతో బద్వేలు నియోజకవర్గం రూపురేఖలు మారుతాయంటూ బద్వేలులో జనం ఎదుటే అన్నారు. రూ.130.6 కోట్లతో చేపట్టే 140కి.మీ మేర సీసీ రోడ్లు,వాటిలో 104 కోట్లు మిగతా 26.6 కోట్లతో శ్మశానాలు, కూరగాయలు మార్కెట్ అభివృద్ధికి వాణిజ్య సముదాయాలు ఇతర పనులకు శంకుస్థాపన చేశారు. కలసపాడు, అట్లూరు, కాశినాయన, పోరుమామిళ్ల మండలాల్లో ఆలయాల అభివృద్ధికి, వంతెనలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ కడప జిల్లాకు ఎంత చేసినా తక్కువే. నన్ను ప్రజలు గుండెల్లో పెట్టుకుని చూసుకుంటారు. మీరు ఇచ్చిన చలువతోనే నేడు రాష్ట్రంలో తిరగగలుగుతున్నా, మీ ప్రేమ, ఆదరణ ఎప్పుడూ మరిచిపోలేనని ఊకదంపుడు ఉపన్యాసం బాగానేచేశాడు కానీ పనుల కోసం నిధులు విడుదల చేసి ఉంటే పనులు త్వరగా పూర్తయ్యేవి. నిధులు విడుదల కాకపోవడంతో పనులు ముందుకు వెళ్లలేదు. సీసీరోడ్లు కేవలం రూ.47 కోట్ల పనులు మాత్రమే జరిగాయి. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. కూరగాయల మార్కెట్, పార్కులు, శ్మశానల అభివృద్ధికి ఇచ్చిన హామీలు పూర్తి కాలేదు. నాగులచెరువును సుందరీకరణ చేపడతామన్నారు. ఆ హామీ అటకెక్కించారు.



కలసపాడు సమీపంలో ఇక్కడే వంతెన నిర్మాణం కోసం జగన్ 9.5 కోట్లతో శంకుస్థాపన చేసింది

జన కేతనం

దాహం దాహం

- బద్వేలులో తాగునీటి సమస్య నివారణకు టీడీపీ హయాంలో పెన్నా నుంచి వాటర్ స్కీం ద్వారా నీటిని అందించాలనుకున్నారు. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వం ఆ ప్రాజెక్టును అటకెక్కించింది. బ్రహ్మంసాగర్ ద్వారా నీళ్లు ఇస్తున్నారు అయితే మూడురోజులకొకసారి వస్తుండడంతో జనం అవస్థలు పడుతున్నారు.
- పోరుమామిళ్లలో రూ.25 కోట్లతో రోడ్ల విస్తరణ పనులు చేపట్టినా అవి ముందుకు సాగడంలేదు. అసంపూర్తి పనులతో జనం అవస్థలు పడుతున్నారు. మినీ మార్కెట్‌యార్డు పనులు పోరుమామిళ్లలో మధ్యలోనే నిలిచిపోయాయి.
- కాశినాయన మండలంలో 22 దేవాలయాలకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అదీ నెరవేరలేదు. శిథిలావస్థకు చేరుకున్న బి.కోడూరు మండలం సగిలేరు గురుకుల పాఠశాలకు అదనపు గదులు ఇస్తామని హామీ ఇచ్చారు. నేటికీ కూడా హామీ నెరవేరలేదు. బికోడూరు మండలం గోవిందాయపల్లెలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అదీ నెరవేరలేదు. అట్లూరు మండలం వేమలూరు సగిలేరు మధ్య రూ.22 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి సీఎం జగన్ వేసిన శిలాఫలకం అలాగే నిలిచిపోయింది. ముంపువాసులకు ఇళ్లు, భూములు పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. అదీ అమలు కాలేదు. కుడికాల్వ పనులు పూర్తి చేసి అట్లూరుకు తెలుగంగ నీరు అందిస్తామని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. రాత్రి పూట సిద్దవటం మీదుగా కడప వెళ్లాలంటే చెక్‌పోస్టుతో ఇబ్బందిగా ఉంది. అత్యవసర సమయాల్లో అవస్థలు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం చెక్‌పోస్టు ఎత్తివేస్తామని హామీ ఇచ్చారు అమలు కాలేదు. కలసపాడు నుంచి బ్రాహ్మణపల్లెకు వెళ్లే దారిలో సగిలేరు వంతెనపై రూ.9.5 కోట్లతో నిర్మించే బ్రిడ్జికి సీఎం జగన్ ఉప ఎన్నికల సందర్భంగా శంకుస్థాపన చేశారు. ఈ బ్రిడ్జి పూర్తయితే కలసపాడులోని నాలుగు గ్రామాలు, ప్రకాశం జిల్లాలోకి కూడా రవాణా మెరుగు అవుతుందని చెప్పుకొచ్చారు. హామీ శిలాఫలకాలకే పరిమితమైంది.

అడుగుపడని వెలుగొండ

వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కలసపాడు, కాశినాయన, పోరుమామిళ్ల మండలాల్లో 25వేల ఎకరాలకు సాగు, తాగునీరు అందించేందుకు ఆ ప్రాజెక్టు డిజైన్ చేశారు. 2004 ఎన్నికల్లో, 2009, 2019 ఎన్నికల్లో కూడా వెలుగొండ ప్రాజెక్టు నీరు తీసుకవస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇంత వరకు అది కార్య రూపం దాల్చలేదు. వెలిగండ నీరు వస్తే తెలుగుగంగ జలాలకు అందని కలసపాడు, కాశినాయన, పోరుమామిళ్ల మండలాల్లోని గ్రామాలకు సాగునీరు అందుతుంది. అయితే హామీ ముందు కు పడలేదు. తెలుగుగంగ ప్రాజెక్టు పిల్ల కాల్వలు, ఇతర పనులు పూర్తి కాకపోవడంతో చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి కేవలం చెరువులు నింపి వాటి ద్వారా అందిస్తున్నారు.



బద్వేలులోని కూరగాయల మార్కెట్



పులకించిన భద్రగిరి

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



స్వామివారి ఊరేగింపు



ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు



హత్య కేసులో నిందితుల అరెస్ట్

వివరాలు వెల్లడించిన రూరల్ సీఐ తులసీరామ్



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ తులసీరామ్

రాయచోటిటౌన్, ఏప్రిల్17: ఈడిగప ల్లె సమీప చిన్నచెరువులో జరిగిన కొండమర్ల ఈశ్వరయ్య హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ తులసీరామ్ తెలిపారు. సుండుపల్లె మండలం పొలిమేరపల్లె గ్రామం ఈడిగపల్లె చిన్న చెరువులో జరిగిన ఈశ్వరయ్య హత్య కేసు వివరాలను రాయచోటి రూరల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ వెల్లడించారు. సుండుప ల్లె మండలం చిన్నగొల్లపల్లె పంచా యతీ పూజారివాండ్లపల్లె సమీపంలో ఈనెల 1వ తేదీ రాత్రి శ్రీచింతకోట మ్మ జాతర జరిగింది. జాతరకు సంబేపల్లె మండలం ప్రకాశ్ నగర్ కాలనీ వాసి కొండమ ర్ల ఈశ్వరయ్య వెళ్లాడు. ఈ క్రమంలో ఈడిగప ల్లె వద్ద చాందినీ బండి వద్ద డ్యాన్సులు చూ స్తున్న ఈశ్వరయ్యను గుంతరావపల్లె వాసి బు జే రవీంద్రనాయుడు అలియాస్ రవి, ఈడిగ పల్లెకు చెందిన కమలాపురం జ్ఞానేశ్వర్ అలియాస్ జాను రాత్రి మూడు గంటల సమయంలో ఈడిగపల్లె పక్కనే ఉన్న చిన్నచెరువులోకి తీసుకెళ్లి బండరాళ్లతో ముఖం, తల మీద కొట్టి చంపి అని వద్ద ఉన్న రూ.38,500 డబ్బు దొంగలించుకుపోయారు. ఈ విషయంపై మృతుడు ఈశ్వరయ్య తమ్ముడు కొండమర్ల చిన్నప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాయచోటి రూరల్ సీఐ తులసీరామ్, సుండుపల్లె ఎస్ఐ ఎస్‌కేఎం హుస్సేన్ ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకుని నిందితుల కోసం గాలిస్తుండగా 16వ తేదీన రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా ఇచ్చిన సమాచారంతో నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి చేసి రూ.29 వేలు స్వాధీనం చేసుకుని బుధవారం రాయచోటి కోర్టులో హాజరు పర్చగా కోర్టు నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించినట్లు రూరల్ సీఐ తెలియజేశారు. ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకుని ఛేదించిన రాయచోటి రూరల్ సీఐ తులసీరామ్, సుండుపల్లె ఎస్ఐ ఎస్‌కేఎం హుస్సేన్‌ను డీఎస్పీ అభినందించారు.

కొనసాగుతున్న ఉద్రిక్తత



ఓర్సు లక్ష్మీకాంతను కొడుతున్న దృశ్యం

చిన్నమండెం, ఏప్రిల్17: శ్రీనివాసపురం వద్ద మంగళవారం ప్రారంభమైన గొడవతో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. వివరాల్లోకెళితే.... మంగళవారం సాయంత్రం 5 గంటలకు టీడీపీ, వైసీపీ సానుభూతి పరుల నడుమ ఘర్షణ తలెత్తి టీడీపీ వర్గీ యులపై వైసీపీ వర్గీయులు రాళ్ల దాడి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు కేంద్ర బలగాలతో ఎస్ఐ రమేశ్‌బాబు చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. అయితే బుధవారం ఉదయం బాధితురాలు ఓర్సు లక్ష్మీకాంత బోరుబావి వద్ద నీటి కోసం వెళ్లగా అధికార పార్టీ గ్రామ స్థాయి నేత అండతో వైసీపీ సానుభూతి పరులు ఆమెను తీవ్రంగా కొట్టి గాయపరిచారు. వెంటనే ఆమెను రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇంత జరుగుతున్నా ఇక్కడ ఎలాంటి గొడవ జరగలేదని, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రమేశ్‌బాబు వివరణ ఇవ్వడం కొసమెరుపు. కేవలం ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గస్తీ కాస్తున్నామే తప్ప గొడవలు జరగడం లేదని ఎస్ఐ మాట దాటవేస్తున్నారు.

మదనపల్లె సబ్‌జైలులో రిమాండ్ ఖైదీ మృతి



మొగిలప్ప మృతదేహం

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 17: మదనపల్లె స్పెషల్ సబ్‌జైలులో రిమాండు ఖైదీ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఆర్డీఓ హరిప్రసాద్ మెజిస్టీరియల్ విచారణ చేపట్టారు.

చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలం ముత్తుకూరు వాసి పాపన్న కుమారుడు మొగిలప్ప(67) నాటుసారా విక్రయిస్తున్నాడని పోలీసులు ఈనెల 16న అరెస్టు చేసి పలమనేరు కోర్టు ఎదుట హాజరు పరచగా కోర్టు రిమాండు విధించిది. పోలీసులు మదనపల్లె సబ్‌జైలుకు మంగళవారం సాయంత్రం 5.30గంటలకు తీసుకొచ్చారు. మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పరిశీలించిన సబ్‌జైలు సిబ్బంది మొగిలప్పను జైలు బ్యారెక్‌లోకి పంపారు. కాగా బుధవారం మొగిలప్ప అపస్మారక స్థితిలో పడి ఉండడంతో జైలు సూపరింటెండెంట్ రామకృష్ణయాదవ్, సిబ్బంది అతడిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మొగిలప్ప మృతిచెందాడని నిర్ధారించారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమలా సుదర్శనం, మాలమహానాడు నేతలు ఆస్పత్రి వద్ద మొగిలప్ప కుటుంబీకులను విచారించారు.

సివిల్స్‌లో హరిప్రసాద్‌కు 475వ ర్యాంకు



రాజంపేట టౌన్, ఏప్రిల్17: రాజంపేట మండలం ములక్కాయలపల్లె వాసి కడుమూరి హరిప్రసాద్‌రాజు సివిల్స్‌లో 475వ ర్యాంకు సాధించారు. జాతీయ స్థాయిలో 475వ ర్యాంకు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. హరిప్రసాద్‌రాజు తల్లి వెంకటసుబ్బమ్మ ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్నారని, తండ్రి నాగేంద్రవర్మ టీచర్‌గా పనిచేస్తూ ఇటీవల మృతి చెందారు. రాజు చెల్లెలు చందన ఎంబీబీఎస్ పూర్తి చేసి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నారు. మరో చెల్లెలు ఖరగ్‌పూర్‌లో ట్రిపుల్‌ఐటీ చదువుతున్నారు.

వివేకా హత్య ఆ ఇద్దరికి ముందే తెలుసు

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు, ఏప్రిల్ 17: వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేస్తారనే విషయం వైఎస్ జగన్ ఆయన భార్య భారతిరెడ్డిలకు ముందే తెలుసునని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జమ్మలమడుగు ఎన్డీయే కూటమి అభ్యర్థి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి తెలిపారు. బుధవారం జమ్మలమడుగు బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వివేకా హత్య మార్చి 15న జరుగుతుందని జగన్‌రెడ్డికి, భారతిరెడ్డి, అవినాశ్‌రెడ్డికి ముందే తెలుసన్నారు. ఆ రోజున తాను ప్రొద్దుటూరులో ప్రచారంలో ఉన్నప్పుడు వివేకానందరెడ్డి బంధువైన శివప్రకాశ్‌రెడ్డి, ధనిరెడ్డి శేఖర్‌రెడ్డి ఫోన్ చేసి హత్యగురించి చెప్పారన్నారు. అదే రోజు శివప్రకాశ్‌రెడ్డి కుమారుడు రోహిత్ కూడా చెప్పారన్నారు. వివేకా ఎక్కువగా సిగరెట్లు తాగుతారని, వాంతికి చేసుకుని చనిపోయాడని తర్వాత గుండెపోటు అని, ఇవన్నీ జగన్ టీవీ చానల్‌లోనే చెప్పిన రెండు గంటల తర్వాత తాము ఈ విషయాలను మాట్లాడుకున్నామని ఆదినారాయణరెడ్డి తెలిపారు. విజయసాయిరెడ్డి కూడా గుండెపోటు అని, వారి టీవీలోనే ప్రచారం చేశారన్నారు. ఆరోజు సిట్ బృందం తనను విచారణ చేసినప్పుడే ఈ విషయాలన్నీ వారికి చెప్పానన్నారు. తర్వాత జగన్ మేనమామ కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి తనపై కేసు మోపాడన్నారు. చేసిందంతా చేసి వారి తప్పులు బయటకు రాకూడదని చంద్రబాబు ఆధ్వర్యంలో తాను, బీటెక్ రవి, ప్రస్తుతం వైసీపీలో ఉన్న మాజీ ఎమ్మెల్సీ సతీశ్‌రెడ్డి కలిసి వివేకాను చంపినట్లు తమపై వార్తలు రాశారన్నారు. వివేకా హత్యకు సంబంధించిన వివరాలన్నీ సీబీఐ వద్ద ఉన్నాయన్నారు.

అంగరంగ వైభవంగా శ్రీరామనవమి వేడుకలు





చెన్నూరులో సీతారామ కల్యాణం... కడప నగరంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి...సింహాద్రిపురంలో స్వామివారి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న దృశ్యం

కడప (కల్చరల్), ఏప్రిల్ 17: రామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం రామాలయాలు మామిడి తోరణాలతో, రంగురంగుల వి ద్యుత్ దీపకాంతులతో దేదీప్యమానంగా వెలుగొంది శోభ సంతరించుకున్నాయి. రామాలయాలు లేని గ్రామమంటూ ఉండదంటే అతిశయోక్తి కాదు. సీతారాముల కల్యాణం నయనానందకరంగా జరిగింది. భక్తులకు ఆలయాల వద్ద పానకం, వడపప్పు, తీర్థ ప్రసాదాలు, అన్నదానాలు నిర్వహించారు.

నాగరాజుపేట ఆలయంలో...కడప నగరం నాగరాజుపేటలో వెలసిన రామాలయం వద్ద ఆ ఆలయ పూజారి గుండ్లపూడి సుధాకర్‌శర్మ సారథ్యంలో రాములోరి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు.

హబీబుల్లా వీధిలో... నగర హబీబుల్లా వీధిలో వెలసిన సీతారామస్వామి దేవాలయం వద్ద సీతారాముల కల్యాణం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసన్న వెంకటేష్ స్వామి సారథ్యంలో ధర్మకర్తలు భవనాశి (బ్రదర్స్) ప్రభాకర్‌శ్రేష్టి పర్యవేక్షణలో సాగిన కల్యాణ కార్యక్రమానికి భక్తులు హాజరై తిలకించారు. హౌసింగ్ బోర్డులో వెలసిన కోదండరామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

సీతారాముల సేవలో వాసు దంపతులు

శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా కడప నగరంలోని పలు రామాలయాలలో నిర్వహించిన సీతారాముల కల్యాణ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డప్పగారి శ్రీనివాసులురెడ్డి (వాసు) ఆయన సతీమణి, తెలుగుదేశం పార్టీ కడప అసెంబ్లీ అభ్యర్థి మాధవీరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి భక్తులకు అన్న ప్రసాదాలను అందజేశారు.

వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

చెన్నూరు, ఏప్రిల్ 17:శ్రీరామనవమి సందర్భంగా స్థానిక సీతారామ సంకీర్తన క్షేత్రంలో బుధవారం సీతారాముల కళ్యాణం కన్నులపండువగా జరిగింది. వేద పండితులు వరదరాజన్ భట్టర్ ఆధ్వర్యంలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు నిర్వహించిన కల్యాణానికి ప్రజలు పెద్దఎత్తున హాజరై తిలకించి తరించారు. ప్రత్యేకంగా 50 మంది దంపతులు ఈ కల్యాణోత్సవానికి హాజరై కంకణాలు ధరించి స్వామివారిని దర్శించుకున్నా రు. అలాగే చెన్నూరు లక్ష్మీనగర్, బుడ్డాయపల్లె, బె స్త కాలనీ, తదితర ప్రాంతాల్లో సీతారామ కల్యాణం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం కల్యాణ ఉత్సవమూర్తులను చెన్నూరు పురవీధుల్లో ఊరేగించారు. స్థానిక రైతు గలిజర్ల సాంబరాజు ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు.

వల్లూరులో సీతారామ కల్యాణోత్సవాలు

వల్లూరు, ఏప్రిల్ 17: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని అన్ని రామాలయాల్లో నవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. వల్లూరు, కొప్పోలు, పెద్దపుత్త తదితర గ్రామాల్లోని రా మాలయాల్లో కళ్యాణం వైబవంగా నిర్వహించారు. వేదపండితుల మం త్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ భక్తుల ఆనందోత్సాహాల మధ్య సీతమ్మ అమ్మవారికి మగళసూత్రం అలంకరించారు. ముత్యాల తలంబ్రాలు పోశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. వ ల్లూరు, పెద్దపుత్త గ్రామాల్లోని రామాలయాల్లో ముఖ్యంగా యోగి రామాయలంలో విశేషంగా పూజలు చేశారు. యోగిరామాలయంలో అన్న ప్రసాదం వితరణ చేశారు. సాయంత్రం కోలాటాల మధ్య గ్రామోత్సవం అలరించింది.

దశరథ మహారాజస్వామి ఆలయంలో...

చక్రాయపేట, ఏప్రిల్ 17: మండలంలోని దేవరగుట్టపల్లె-నాగులగుట్టపల్లె మధ్యలో వెలసిన శ్రీరామచంద్రుని తల్లిదండ్రులైన కౌసల్య, సు మిత్ర, కైకేయి సమేత దశరథ మహారాజ స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన భజనలు ఆకట్టుకున్నాయి. అన్నప్రసాదం పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

కడప(రూరల్), ఏప్రిల్ 17: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా కడప నగరం 18వ డివిజన్ స్వామినగర్‌లోని కోదండరామస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్తలు కిన్నెర నాగరాజు, చందన్‌లతో పాటు కమిటీ సభ్యుడు క్రిష్టయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణానికి భక్తులు హాజరై తిల కిం చారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్త లు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం శ్రీరాముని పట్టాభిషేకం కార్యక్రమం తదుపరి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

వేంపల్లెలో...వేంపల్లెలో శ్రీరామనవమి ఉత్సవాలు వేడుకగా జరిగాయి. మండలంలోని అన్ని రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వృషభాచలేశ్వరస్వామి భజన బృందం ఆధ్వర్యంలో అన్ని రామాలయాల్లో భజన కార్యక్రమం నిర్వహించారు. పా నకం, వడపప్పు పంపిణీ చేశారు. పెద్దఎత్తున భక్తులు హాజరై పూజలు నిర్వహించారు.

చింతకొమ్మదిన్నెలో... చింతకొమ్మదిన్నె మండలంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలకు మామిడి తోరణాలు అలంకరించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మొదటిరోజే కొన్ని గ్రా మాల్లో స్వామివారి కల్యాణ మహోత్సవాలు, అన్నదానాలు నిర్వహించి గ్రామోత్సవం చేప ట్టారు. మరికొన్ని గ్రామాల్లో మూడవ రోజు, 4, 5 రోజుల్లో గ్రామోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సింహాద్రిపురంలో... మండలంలోని నిడివెలగల ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాములోరి కల్యాణ మహోత్సవం ఘ నంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు మధుసూదనరావు ఆధ్వర్యంలో హరనాబాద్ సోదరులు పరమేశ్వర్‌రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, గిరిధర్‌రెడ్డి దంపతులచే వేద మంత్రోచ్చరణలతో స్వామివారి కల్యాణం కన్నులవిందుగా జరిపించారు. అనంతరం ఆలయ ధర్మకర్త లక్ష్మీనారాయణరెడ్డి తీర్థ, ప్రసాదాలు ఏర్పాటు చేశారు.

వాడవాడలా శ్రీరామనవి వేడుకలు

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 17: మండలంలోని పలు గ్రామాలలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా వాడవాడల శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. విగ్రహాలను ప్రత్యేకంగా వివిధ పుష్పాలతో అలంకరించి స్వామివారికి నైవేద్యంగా వడపప్పు, పానకాన్ని స్వామివారి ముంగిట ఉంచి భక్తులు ప్రత్యేక పూజలు జరిపించారు. ప్రత్యేకంగా ఉత్సవ విగ్రహాలను ఉంచి డప్పు వాయిద్యాల మధ్య బాణసంచాలు పేలుస్తూ కోలాటాల మధ్య ఘనంగా పురవీధుల వెంట గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

పెద్దరంగాపురంలో కనువిందుగా కల్యాణం

పులివెందుల టౌన్, ఏప్రిల్ 17: మున్సిపాలిటీ పరిధిలోని పెద్దరంగాపురం గ్రామం నందు బుధవారం శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని గ్రామంలో ప్రజలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ పండితులు సీతారామ లక్ష్మణులను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం ప్రాతఃకాల పూజలతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం గ్రామ పెద్దల సమక్షంలో సీతారామ లక్ష్మణ దేవస్థానం ఆవరణంలో సీతారాముల కల్యాణం ఆలయ పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కళ్యాణానికి గ్రామంలోని గ్రామ ప్రజలందరు మహిళలు భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం గ్రామ పెద్దల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. యువకులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొని కుందేళ్లను పట్టుకోవడానికి ప్రయత్నాలు చేశారు. ఇందులో ఒక కుందేలును ఎవరు కూడా పట్టుకోలేకపోయారు. అనంతరం సీతారామ లక్ష్మణుల ఉత్సవ విగ్రహాలతో గ్రామం అంతా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు పానకం, పప్పు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

కన్నులపండువగా గ్రామోత్సవం

చక్రాయపేట, ఏప్రిల్ 17: ప్రసిద్ధ గండి క్షేత్రంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వేడుకలు కన్నులపండువగా సాగాయి. భజనలు, హరికథా కాలక్షేపం, కోలాట కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ కావలి కృష్ణ తేజ, సభ్యులు రాధాకృష్ణయ్య, చక్రపాణిరెడ్డి, ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు కేసరి స్వామి, రాజా స్వామి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వర, రాచరాయ దేవస్థానంలో...

మండల కేంద్రమైన వేంకటేశ్వర, రాచరాయ దేవస్థానంలో సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. చైర్మన్ లాయర్ రామాంజనేయరెడ్డి, మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, రామిరెడ్డిగారి ఓబుల్ రెడ్డి, హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణానికి భక్తులు విరివిగా పాల్గొన్నారు.





గండిలో చేపట్టిన శ్రీరామనవమి గ్రామోత్సవంలో ఊరేగుతున్న ఆంజనేయస్వామి... పులివెందులలో కుందేలును పట్టుకునేందుకు పోటీపడుతున్న జనం...సీతారాములకు కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

సభ్యత్వం లేదు... కార్యకర్తలు కాదు

- వారు టీడీపీ అంటూ వైసీపీలో చేర్చుకోవడం హాస్యాస్పదం
- రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లిఖార్జునరెడ్డి



మాట్లాడుతున్న రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లిఖార్జునరెడ్డి

చెన్నూరు, ఏప్రిల్ 17 : టీడీపీ సభ్యత్వం లేకపోయినా, పార్టీ కార్యకర్తలు అని వైఎస్సీపీ కండువా వేసి వంద కుటుంబాల వారు టీడీపీ నుం చి వైసీపీలోకి చేరారని చెప్పుకోవడం హాస్యాస్పదమని రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి జి.మల్లిఖార్జునరెడ్డి అన్నారు. చెన్నూరులో బుధవారం సాయంత్రం ఆయన సమావేశంలో మాట్లాడుతూ 2014-19, అంతకు ముందు కూడా కాంగ్రెస్ పార్టీకి, వైసీపీకి ఓట్లు వేసి ఆ నాయకుల వెంట తిరిగిన వారు వైసీపీ కార్యకర్తలు కాక టీడీపీ కార్యకర్తలా అని ప్రశ్నించారు. అలాంటి వారికి చెన్నూరులో వైసీపీ కండువాలు వేసి వీరంతా టీడీపీ నుంచి వైసీపీలో చేరారని గ్రూపుల్లో పెట్టుకోవడం దారుణమన్నారు. ఎక్కడైనా వారికి సభ్యత్వాలు ఉంటే మేం తప్పక ఒప్పుకుంటామన్నారు. టీడీపీ సభ్యత్వాలే లేకుండా ఏదో మేం ఇంత మందిని చేర్పించుకున్నాం, మాకు ఇంత మంది వస్తున్నారు అని చెప్పడం చూస్తుంటే వైసీపీ వారు పరోక్షంగా వారి స్థాయిని తక్కువ చేసుకున్నట్లే అన్నారు. ప్రజలను మభ్యపెట్టేలా చేస్తే ఎవరూ నమ్మరన్నారు. రెన్యువల్ చేసుకున్నట్లుగా వైసీపీ వారే వైసీపీ కండువాలు వేసుకుంటున్నారని ఆగ్రహించారు. జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ రామకోటిరెడ్డి, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి, మం డల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, బీసీ మండల అధ్యక్షుడు ఆటోబాబు, జిల్లా మైనార్టీ నాయకులు షబ్బీర్‌హుసేన్, జిల్లా కార్యదర్శి మంజూరు అహ్మద్ పాల్గొన్నారు.

వైసీపీ పని అయిపోయింది

- వేంపల్లెను సుందరంగా తీర్చిదిద్దుతాం
- బీటెక్ రవి సమక్షంలో టీడీపీలో చేరిక



టీడీపీలోకి చేరిన వారితో బీటెక్ రవి, నాయకులు

వేంపల్లె, ఏప్రిల్ 17: రాష్ట్రంలో వైసీపీ పని అయిపోయిందని, ఆ పార్టీపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వచ్చిందని పులివెందుల నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరడమే ఇందుకు నిదర్శనమని పులివెందుల టీ డీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి తెలిపారు. వేంపల్లె టీడీపీ కార్యాలయం వద్ద బుధవారం రాజీవ్‌కాలనీకి చెందిన వైసీపీ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, చౌడయ్య, బాబు, కమలాకర్, శ్రీనివాసులు, శివ తదితర 20 కుటుంబాల వారు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి బీటెక్ రవి టీడీపీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయ్యే వరకు అందరు సమిష్టికృషితో పనిచేయాలని సూచించారు. వేంపల్లెలో రోడ్ల పనులు ఎక్కడికక్కడ నిలిపివేశారని, డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉందని, పాపాఘ్ని నది చెంతనే ఉన్న తాగునీటిని అందించలేని దుస్థితిలో ఉన్నారన్నారు. ఈ పనులన్నీ పూర్తిచేసే బాధ్యత టీడీపీ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. వేంపల్లెను సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. గిడ్డంగివారిపల్లె రిజర్వాయర్‌లో చేటుచేసుకున్న అవినీతిని సాక్ష్యాధారాలతో బయటపెట్టేందుకు సిద్ధమన్నారు. జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జయరామిరెడ్డి, మండల కన్వీనర్ మునిరెడ్డి, మైనార్టీ సీనియర్ నాయకులు షబ్బీర్, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ దర్బార్, పట్టణ అధ్యక్షుడు రమేష్, మండల ఉపాధ్యక్షుడు భద్ర తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ గెలుపే ధ్యేయంగా పనిచేద్దాం'



వేములలో నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పార్థసారధిరెడ్డి

వేముల, ఏప్రిల్ 17: పులివెందులలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బీటెక్ రవి గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రమైన వేములలో టీడీపీ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పడకేసిందని, సంక్షేమం సంక్షోభంలో ఉందన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం చంద్రబాబునాయుడుతోనే సాధ్యమన్నారు. గత టీడీపీ హయాంలో పాలన ఎలా ఉంది, ప్రస్తుత ప్రభుత్వ పాలన ఎలా ఉందో ప్రజలందరికి వివరించాలన్నా రు. టీడీపీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు. శక్తివంచన లేకుండా పనిచేయాలని టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఓబుల్‌రెడ్డియాదవ్, ఓబయ్య, సత్యమారెడ్డి, రమణారెడ్డి, రామిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివ, ధనుంజయ, భైరవకొండయ్య పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం, దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 17 : కడప నగరం శంకరాపురానికి చెందిన సూర్య డెవలపర్స్ అధినేత సుతేంద్రనాద్ జన్మదిన సందర్భంగా బుధవారం కడప నగరం జడ్పీ కాంపౌండులో గల ప్రేమాలయ నిరాశ్రయుల వసతిగృహంలో వైఎస్ జగన్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అలాగే దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంచి సురేంద్రనాథ్ జన్మదిన వేడుకలు నిరాశ్రయుల న డుమ జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. భగవంతుని ఆశీస్సులతో పెద్దల దీవెనలతో మరోన్నో జన్మదిన వేడుకలు జరుసపుకోవఠలని కోరారు. శంకరాపురం అశోక్‌కుమార్ క్రిష్టారెడ్డి, వల్లి బాషా, శివశంకర్, మాధవరెడ్డి, వసతిగృహం నిర్వాహకులు శ్రీనవాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి



ప్రచారంలో పాల్గొన్న నాగరాజు (శ్యామ్)

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 17 :కడప నగరంలో కొందరు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారు.. కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నా వాటిని పట్టించుకోని పరిస్థితి నెలకొందన్నారు. కడప నగరంలో బుధవారం 26వ డివిజన్ మాసాపేటలో వైసీపీ అభ్యర్థి అంజద్‌బాషా తమ్ముడు అహ్మద్‌బాషా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో కార్పొరేషన్‌లో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగి బక్కా నాగరాజు (శ్యామ్) అనే వ్యక్తి ఇంటింటికీ తిరిగుతూ వైసీపీకి ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారు. ఇలా చేయడం భయం లేనితనమని పలువురు పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రారంభోత్సవం
జన్మదిన శుభాకాంక్షలు
ప్రమాణస్వీకారం
వివాహ మహోత్సవం
ఉద్యోగ విరమణ
విదేశీయానం
స్వదేశాగమనం
ఇప్పుడు ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి. అందుకు మీ ప్రాంతంలోనే మా ప్రకటనల ప్రతినిధి అందు బాటులో ఉన్నారు సంప్రదించండి.
పొలిటికల్ యాడ్స్
షష్టిపూర్తి మహోత్సవం
సినిమా యాడ్స్
శ్రద్ధాంజలి
లీగల్ యాడ్స్
ప్రభుత్వ ప్రకటనలు
క్లాసిఫైడ్స్
యూనిట్ కార్యాలయం
సర్వే నెం. 137 & 138/3, చిన్నమాచుపల్లె చెన్నూరు మండలం, కడప.
Cell: 9985411183, 9985411189.
ప్రాంతీయ కార్యాలయాలు :
కడప: Cell : 99854 11192, 99854 10691, 99854 02134
కమలాపురం : 9985411183 ప్రొద్దుటూరు : 9985921354, పులివెందుల : 9985411183
జమ్మలమడుగు : 9985401296 మైదుకూరు : 7989603861 రాజంపేట : 9985411193
రాయచోటి: 9985411183 బద్వేలు: 9985921375 కోడూరు : 9985411183.

అభివృద్ధి కోసం టీడీపీకి ఓటేయండి



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, ఏప్రిల్ 17 : రానున్న ఎన్నికల్లో అభివృద్ధి కోసం టీడీపీకి ఓటు వేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. బు ,దవారం మండల పరిధిలోని ఎర్రగుడిపాడు రాయునిపేట తదితర గ్రామాల్లో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. వారు ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. టీడీపీఅ ధికారంలోకి వస్తేనే యువతకు నిరుద్యోగ భృతి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. 2019 ఎన్నికల్లో ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి ప్రజలను మోసగించి అభివృద్ధి పనులు చేయకుండా ప్రజలపై పడి దోచుకోవడమే పనిగా పెట్టుకున్నాడన్నారు. ఏ గ్రామంలో అయినా ఒక్క అభివృద్ధి పనులు చేశారా అని ప్రశ్నించారు. మద్యపాన నిషేధమని చెప్పి దొంగ నాటకాలు ఆడారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పాలన్నారు. టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా, రాఘవరెడ్డి, వాసుదేవరెడ్డి, రామక్రిష్ణరెడ్డి, దివాకర్‌రెడ్డి, కంకర సుబ్బారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, క్రిష్ణకుమార్‌రెడ్డి, పాండురగారెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు

మండల పరిధిలోని పెద్దచెప్పలి గ్రామంలో వైసీపీ నుంచి 20 కుటుంబాలు మాచిరెడ్డిపల్లెలోని పుత్తా నరసింహారెడ్డి స్వగృహంలో పెద్దచెప్పలి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సుధాకర్, శ్రీను, రఘువారి ఆధ్వర్యంలో పుత్తా నరసింహారెడ్డి సమక్షంలోటీడీపీలో చేరారు. వారందరికీ పుత్తా టీడీపీ కండువా వేసి ఆహ్వానం పలికారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న బసివిరెడ్డి

కడప (క్రైం), ఏప్రిల్17: వేసవి కాలంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి వుం డాలని కడప అగ్నిమాపక అధికారి బసివిరెడ్డి సూచించారు. జాతియ అగ్నిమాపక వారోత్సావల్లో భాగంగా బుధవారం ఎస్టేట్‌లోని కంపెనీలలో పనిచేస్తున్న సిబ్బందికి అవగాహన సదస్సును నిర్వహించారు. మండే వస్తువులతో జాగ్రత్తగా ఉండాలన్నా రు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు భయంతో పరుగెత్తకుండా మంటలను అదుపు చేయాలన్నారు.

వైసీపీ వైఫల్యంతోనే కడపలో నీటి సమస్య

- టీడీపీ నాయకుడు డాక్టర్ జిలాన్

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 17 : వైసీపీ పాలకవర్గం వైఫల్యంతోనే కడప నగరంలో నీటి సమస్య ఏర్పడిందని టీడీపీ నాయకులు డాక్టర్ జిలాన్ తెలిపారు. బుధవారం కడప నగరం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ ఎడారిలా మారకూడదని గత టీడీపీ ప్రభుత్వాలు తెలుగుగంగ, హంద్రినీవా, గాలేరు నగరి, సుజల స్రవంతి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, పట్టిసీమ ప్రాజెక్టులు నిర్మాణం చేస్తే ఈ వైసీపీ ప్రభుత్వం నీటిపారుదల శాఖకు గాలికి వదిలేసిందన్నారు. పోలవరంకు రివర్స్ టెండరింగ్ పేరిట పంగనామాలు పెట్టేసి తుంగభద్ర బోర్డు ఊసే లేకండా చేసిందన్నారు. క్రిష్ణ, గోదావరి జ లాలు సక్రమంగా ఉపయోగించడంలో విఫలమైందన్నారు. ఈ రోజు నీటి కష్టాలకు మహిళలు బిందెలతో రోడ్లు ఎక్కాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. పట్టిసీమ పనికిరాదని అసెంబ్లీలో వత్తాసు పలికిన కడప ఎమ్మెల్యే ఈ రోజు ఏం సమాధానం ఇస్తారని ప్రశ్నించారు. అసమర్థ వైసీపీ ప్రభుత్వానికి ఇంటికి పంపాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు వేణుగోపాల్, ఎస్కే బాషా, శ్రీనునాయక్, మహబూబ్‌ఖాన్, అశోక్ పాల్గొన్నారు.

'చంద్రబాబును విమర్శించే అర్హత వీరశివారెడ్డికి లేదు'

పెండ్లిమర్రి, ఏప్రిల్ 17: చంద్రబాబునాయుడిని విమర్శించే అర్హత వీరశివారెడ్డికి లేదని మండల టీడీపీ అధ్యక్షుడు సంగటి గంగిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రబాబు డబ్బు తీసుకొని టికెట్లు అమ్ముకున్నాడని వీరశివారెడ్డి అనడం సమంజసం కాదన్నారు. మూడు నెలల క్రితం టీడీపీలో చంద్రబాబునాయుడి సమక్షంలో కండువా వేసుకొని వచ్చి ఎన్ని రోజులకు పార్టీ మారారు.. ఎంత ముడుపులు ముట్టాయి..ఏయే పార్టీలతో ఎంత డబ్బు తీసుకున్నారో అందరికీ తెలుసునన్నారు. రోజుకో చొక్కా మార్చినట్లు పార్టీలను మారుస్తున్నారన్నారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారన్నారు. కమలలాపురం నియోజకవర్గంలో మిమ్మల్ని ఎవరూ నమ్మే స్థితిలో లేరని గంగిరెడ్డి పేర్కొన్నారు.

'మాలల పురోగతికి కృషి'

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 17: జిల్లాలోని మాలల అభివృద్ధి, సంక్షేమం, పురోగతి కోసం అవిరళ కృషి చేస్తామని మాలమహానాడు జిల్లా నూతన అధ్యక్షుడు చెవుల తిరుపాల్ స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

'వైసీపీకి ఓటేస్తే రోడ్డుపాలే'

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 17: వైసీపీకి ఓటేస్తే వ్యాపారులు రోడ్డు పాలు కావడం తథ్యమని జిల్లా క్లాత్ మర్చంట్ అధ్యక్షుడు చెన్నంశెట్టి మురళీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చిన ఐదేళ్లలో బోర్డు పన్ను,చెత్త పన్ను, అధిక విద్యుత్ చార్జీలతో వ్యాపారులు చితికి పోయారన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోండి

కడప క్రైం (ఏప్రిల్17:అర్హులందరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కడప టూటౌన్ సీఐ ఇబ్రహీం పేర్కొన్నారు. బుధవారం టూటౌన్ పరిధిలోని ప్రాంతాలలో పోలీసు కవాతు నిర్వహించి ప్రజల్లో భరోసా కల్పించారు.

classified ఆంధ్రజ్యోతి lines

బంగారం కొనబడును
మీబంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మాడబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. నంబరు 7382114647
AJA- 176986

యూనిట్ కార్యాలయం
9985411183
9985411189

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ప్రొద్దుటూరు ప్రజల గొంతు నొక్కేసిన రాచమల్లు

ప్రశాంతతను కరువు చేసి శ్మశాన శాంతిని మిగిల్చారు ● ప్రశ్నించాలన్నా పత్రికలు, ప్రతిపక్షాలు, ప్రజలు భయపడేలా చేశారు ●ఇసుక వనరును అడ్డంగా దోచుకుని వందల కోట్లు గడించారు
భూదందాలు నడిపి అక్రమ రియల్ వ్యాపారం సాగించారు ● మార్పు కావాలంటే కూటమి ప్రభుత్వం రావాలి ● **ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి**

ప్రొద్దుటూరు ,ఏప్రిల్ 17 : రాచమల్లు రాజ్యాంగ పాలనలో దశాబ్దాలుగా ప్రశాంతకు మారుపేరుగా వున్న ప్రొద్దుటూరులో ప్రజల గొంతుక నొక్కేయబడింది. బజారులో టీఅంగళ్ల దగ్గర బహిరంగ ప్రదేశాల్లో స్వేచ్ఛగా మాట్లాడుకోలేని, అభిప్రాయాలను ప్రకటించలేని భయానకమైన రోజులు దాపురించాయి. పాతికేళ్ళనాటి పాత ఫ్యాక్షన్ రోజులను గుర్తుచేసుకునేలా చేశారు. ఇందుకు ప్రధాన కారణం ప్రొద్దుటూరులో వైసీపీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఎమ్మెల్యే రాచమల్లు ఆయన బావమరిది బంగారురెడ్డి సాగించిన ఇసుక, భూదందాలపై బీసీ యువ నాయకుడు, న్యాయవాది నందం సుబ్బయ్య నేరుగా సోషల్ మీడియా పత్రికల సాక్షిగా ఆరోపించి ప్రశ్నించారు. అది జీర్ణించుకోలేక నందం సుబ్బయ్యను రాజకీయంగా ప్రజాస్వామ్య బద్ధంగా ఎదుర్కోలేక 2020 డిసెంబరు 29న పట్టపగలు రామేశ్వరం లోని జగనన్న కాలనీలో ఇళ్ళ నిర్మాణ పనుల ప్రారంభ కార్యక్రమంలో హోమం చేస్తుండగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది సాక్షిగా కళ్ళ ముందే దారుణంగా నరికి చంపారు. ఈ హత్యలో ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఆయన బావమరిది బంగారురెడ్డి హస్తం వుందనే బహిరంగ ఆరోపణలున్నా అధికారం అండతో వారిపై హత్యానేరం కేసు నమోదు కాలేదు. కేవలం ఐదుగురు ఎస్సీలను ఈకేసులో నిందితులుగా చూపి ఆ హత్య ఫైలు క్లోజ్‌చేశారనే ఆరోపణలున్నాయి. దీంతో ప్రొద్దుటూరులో మళ్ళీ పాత హత్యా రాజకీయ రోజులను తలపించాయి. ఆ తరువాత వైసీపీ భూదందా, ఇసుక దందాలతో పాటు మట్కా, గుట్కా, జూదం, పేకాట, క్రికెట్ బెట్టింగ్ నుంచి నకిలీ నోట్ల ముద్రణ వరకు వీరి అవినీతి అసాంఘిక నేరసామ్రాజ్యం విస్తరించి అనతి కాలంలోనే వేల కోట్ల అక్రమ ఆస్తులు కూడగట్టే వరకు సాగింది. ఇందువల్ల ప్రొద్దుటూరులో ప్రజలు ఐదేళ్ళ వైసీపీ హత్యా దౌర్జన్య రాజకీయాల నుంచి మార్పు కోరుకుంటున్నారు. ఒకవైపు అభివృద్ధి, ఉపాధి కల్పన లేకపోగా స్వేచ్ఛగా వ్యాపా రాలు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. ఎవ్వరు తమ భూమి అమ్మాలన్నా, వాణిజ్యసముదాయాలు నిర్మించు కోవాలన్నా వారి అనుమ తులు వుండి తీరాల్సిందే. రాచ మల్లు పాలన, రాజకీయాలపై ప్రతి పక్షాల గొంతులు పెగలకుండా నిరసనలు చేపట్టకుండా ప్రజాస్వామ్య యుతంగా ఆందోళనలు జరగనీయకుండా ప్రతిపక్ష నాయకుల ఇళ్ళవద్దనే వారిని అరెస్టులు చేసి వారిని రోడ్లమీదకు కూడా రానీయకుండా నియంత రాజ్యాన్ని నడింపించారు. రాష్ట్రంలో జగన్ మార్కు నియంతృత్వం రాజ్యమేలితే ప్రొద్దుటూరులో రాచమల్లు, బంగారురెడ్డి, కిరణ్‌రెడ్డి (ఆర్‌టీకే) రాజ్యాంగం , నియంతృత్వం అమలు చేశారు,ఈ ఐదేళ్ళలో వారి అరాచకాలపట్ల వున్న భయంతో సామాన్య, మధ్యతరగతి, వ్యాపార, ఉద్యోగ వర్గాలు తప్పని పరిస్థితిలో అణిగిమణిగివున్నారు. శాంతిని కోరుకునే ప్రొద్దుటూరు ప్రజలు ఈ భయానక రోజులను సహించలేకనే వీరి అరాచకాలను దీటుగా ఎదుర్కొగల ననే నమ్మకంతో నన్ను మళ్ళీ క్రియాశీల రాజకీయాల్లోకి ఆహ్వానించారు. ప్రొద్దుటూరులో మళ్ళీ శాంతయుత పరిస్థితులు కావాలని కోరుకున్నారు. అందుకే కేవలం ప్రజా సర్వే ఆధారంగా నాకు టీడీపీ టికెట్టు కూడా ప్రజాభిమానంతోనే వచ్చింది. 80 ఏళ్ళకు పైబడిన వయస్సులో కూడా నన్ను రాజకీయంగా ఆదరించి నా మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా నిలబెట్టుకుంటాను. అందుకే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలబడ్డాను అని నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. ఈనేపథ్యంలో కూటమి అభ్యర్థిగా బరిలో వున్న **నంద్యాల వరదరాజులరెడ్డితో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ...**



● కుటుంబం, రాజకీయ నేపథ్యం ?

జ. మాది భూస్వామ్య కుటుంబం. 200 ఎకరాలు భూమి వుండి వ్యవసాయమే ఆధారంగా వుండేది. మా నాయన పెద్ద వరదారెడ్డి, సుమిత్రమ్మలకు మేం ఐదుగురు ఆడసంతానం, ముగ్గురు మగ సంతానం.మాది పెద్ద కుటుంబం. మా నాయన అప్పటికే రాజకీయాల్లో వున్నారు. ప్రొద్దుటూరు సమితి వైస్‌ప్రెసిడెంట్‌గా పనిచేశాడు.

● విద్యాభ్యాసం ఉద్యోగం ?

జ. నేను అప్పట్లో ఎస్ఎస్ఎల్‌సీ అనిబిసెంటు మున్సిపల్ హైస్కూలులో చదివాను.ఆతరువాత ఉన్నత చదువులకు వెళ్ళలేదు. ఇంట్లో అందరిలో పెద్దవాడిని కావడంచేత ఇంటి బాధ్యతలు తీసుకోవడానికి రెవెన్యూ డిపార్ట్‌మెంటులో గ్రామ రెడ్డిగా పని చేస్తూ వ్యవసాయం చేశాను.

రాజకీయ ప్రవేశం ఎప్పుడు ?

జ. మొట్టమొదట 1981లో సమితి ప్రెసిడెంట్‌గా శెట్టిపల్లె రఘురామిరెడ్డి పై పోటీ చేశాను.అప్పుడు కొన్ని ఓట్ల తేడాతో ఓడిపోయాను. ఆతరువాత 1983లో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా సింహం గుర్తుపై ఇండిపెండెంట్‌గా టీడీపీ అభ్యర్థి ఎంవీ రమణారెడ్డిపై పోటీ చేశాను. కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా వున్న రామిరెడ్డి చంద్ర ఓబుల రెడ్డికి 17,000 ఓట్లురాగా, స్వతంత్ర అభ్యర్థిగా 34,457 ఓట్లు సాధించాను. ఎంవి రమణారెడ్డి 56,970 ఓట్లతో నామీద గెలుపొందారు.

● ఎంవీఆర్ అప్పటికే రాయలసీమలో పెద్ద ప్యాక్షనిస్టు కదా మీరు ఆయనను ఎలా ఎదుర్కొన్నారు?

జ. వాస్తవమే.. రమణారెడ్డి అంటే ప్రొద్దుటూరులో చాలా భయం వుండేది. రాత్రికి రాత్రి గొంతులు కోస్తాడనే ప్రజలు భీతిల్లిపోయేవారు. అలాంటిరోజుల్లో కామనూరు నుంచి ప్రొద్దుటూరుకు వచ్చి నేరుగా రాజకీయాలు చేసి ప్రజలకు అండగా నిలబడ్డాను. 1985లో ఎంవీఆర్ టీడీపీకి రాజీనామా చేసి రాయలసీమకోసం ఉద్యమం నడిపాడు. రాయలసీమ విమోచనా సమితి పేరుతో ఎన్నికల్లో పోటీ చేశాడు. కానీ ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన నన్ను ప్రజలు గెలిపించారు. ఆనాడు కాంగ్రెస్ అభ్యర్థిగా షౌకత్‌అలి అనే మైనారిటీ నాయకుడు పోటీ చేశాడు.ఆ రోజుల్లో ప్రజలు పోలింగ్ బూత్‌లకు వచ్చి ఓటు వేయాలంటే భయపడే రోజులవి. ఏజంటుగా బూత్‌ల్లో కూర్చోవాలంటే ఎంతో ధైర్యం వుండాలి. ఎప్పుడు ఎక్కడ బాంబులు పడతాయో తెలియదు. ఈటెలు, బాకులు, కొడవళ్ళతో ఎక్కడ ఖూనీలు జరుగుతాయో తెలియని పరిస్థితి. అంత అనాగరికంగా వుండేది.

●ఫ్యాక్షన్ రాజకీయాలను రూపుమాపేందుకు మీ ఆయుధం ఏమిటి?

జ. అప్పట్లో ఫ్యాక్షన్ అనే పేరులేదు.గ్రామాల్లో పార్టీలు నడిపేవారు అనేవారు. గుంపులు నడిపేవారు. గతంలో చంద్రన్న గుంపు రమణారెడ్డితో పోరాడేది. వారిద్దరి పార్టీలో చాలా మంది చనిపోయారు. అప్పటికే రమణారెడ్డి పేరున్న పెద్దమనుషులైన లాయర్ రామసుబ్బారెడ్డిని ,జూటూరు క్రిష్ణమూర్తిని, కోటం వీరారెడ్డిని ,రాజువారిపేట వీరారెడ్డిలాంటి వారితో పాటు ఎంవీఆర్ అనేక మందిని ఖూనిచేశారని బహిరంగంగా చెప్పకుంటారు. రమణారెడ్డి కౌన్సిలర్‌గా పోటీ చేసినప్పుడే అతనికి వ్యతిరేకంగా పోతుల వీరారెడ్డి కౌన్సిలర్‌గా నిలబడ్డాడు.అతనికి ఏజంటుగా కూర్చున్న పుల్లారెడ్డి అనే వ్యక్తిని ఆరోజు రమణారెడ్డి వర్గం ఖూనీ చేసింది. అంతదారుణంగా వుండేది. చంద్రన్న వర్గంలో వున్న మైనారిటీ కౌన్సిలర్ కమాల్‌ను కూడా అప్పట్లో రమణారెడ్డి వర్గం ఖూనీ చేసింది. ఈ తరువాత 1985లో నాకు ఎన్నికల్లో మద్దతు ఇచ్చిన వారిని లక్ష్మీపేట కు చెందిన నలుగురిని రమణారెడ్డి వర్గీయులు ఖాదరబాద్ దగ్గర కాటన్ బిల్లువద్ద బస్సులో నుంచి దింపి దారుణంగా నరికి చంపారు. ఆనాలుగు హత్యలకు వ్యతిరేకంగా నేను చట్టబద్ధంగా వారికి శిక్షలు పడి జైలుకు పంపేలా శాంతియుత పోరాటం నడిపాను. ఆతరువాత పార్టీ మారి 1989లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచాను. అప్పటినుంచి వరుసగా 1994,1999,2004 ఎన్నికల వరకు గెలుపొందుతా వచ్చాను.

● ఐదుమార్లు వరుసగా గెలిపించిన ప్రొద్దుటూరుకు మీరు చేసిన అభివృద్ధి ఏమిటి ?

జ. నియోజవర్గంలోని ప్రతి కుగ్రామానికి తారురోడ్డువేయించాము. సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యంతో పాటు లోఓల్టేజీ సమస్యను తీర్చాము. ఈశ్వరరెడ్డినగర్, పెన్నానగర్‌లోని ప్రభుత్వ భూములను పేదలకు ఇంటిపట్టాలిచ్చాము. గోపవరం పంచాయతీ యానాది కాలనీ ఉప్పొంగులో వందల మందికి పేదలకు ఇంటి పట్టాలిచ్చి పక్కాగృహాలు నిర్మించాము. కుందూ నదిమీద వెల్లాల,టంగుటూరు, కూలూరు, వెలవలి కామనూరులలో వంతెనలు నిర్మించాము. ప్రొద్దుటూరు లోని ప్రధాన రహదారులైన మైదుకూరు రోడ్డు, గాంధీరోడ్డు, టీబీ రోడ్డు జమ్మలమడుగు రోడ్డు,శివాలయం వీధి, విస్తరణ చేపట్టి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశాం. ప్రొద్దుటూరు పట్టణం బైపాస్‌రింగు రోడ్లను ఏర్పాటు చేశాం. సివిల్ సర్జన్ ఆసుపత్రినుంచి వందపడకలు ఆతరువాత 350 పడకలుచేసి జిల్లా ఆసుపత్రిగా తీర్చిదిద్దాము. ప్రభుత్వ ఇంజనీరింగ్‌కాలేజీ ,పశువైద్య కాలేజీ తీసుకొచ్చి ఆధునిక భవనాలు నిర్మించాము. జిల్లా కోర్టు సముదాయ భవనాలు కట్టాము. అటవీశాఖద్వారా రాజీవ్‌గాంధీ ఎకో పార్కు నిర్మించాము. పెన్నానదిపై హైలెవల్ వంతెన నిర్మించాము. ప్రొద్దుటూరుకు రైల్వే స్టేషను, రైల్వేలైను సాధించాము. విజయవాడ, తిరుపతి, అనంతపురం లను అనుసంధానం చేస్తూ రైలు సౌకర్యం కల్పించాము. మున్సిపల్ కార్యాలయాన్ని రాయలసీమలోనే ఆధునాతన పెద్ద కార్యాలయంగా ఆదాయం వున్న మున్సిపాలిటీగా రూపుదిద్దాం. అమృత్‌నగర్‌లో 350 ఎకరాల్లో పదివేలమంది పేదలందరికీ ఇళ్ళు కట్టించి పెద్ద టౌన్‌షిప్ నిర్మించాము. ప్రొద్దుటూరులో అప్పటి వరకు ఆధునికీకరణకు నోచుకోని మురిగునీటి కాలువలను 37 కోట్లతో నాలుగు ప్రధాన కాలువలు ఆధునీకరించాం. 24 కోట్లతో ప్రొద్దుటూరులో భూగర్భ పైపులైను నిర్మించి కొత్తగా ఐదు తాగునీటి రిజర్వాయర్లు నిర్మించి ఇంటింటికి తాగునీటిని అందించాం. మున్సిపల్ ప్లాట్లను విక్రయించి వచ్చిన 14 కోట్ల ఆదాయంతో టీబీ కాంప్లెక్స్ ,గాంధీరోడ్డులో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా స్టేట్ బాంకు పక్కన మున్సిపల్ స్థలాలలో షాపు రూములు నిర్మించి అద్దెలతో ఆదాయం పెంచాం. ప్రొద్దుటూరులో శాశ్వత తాగునీటి సమస్యతీర్చడానికి కుందూ పెన్నా అనుసంధాన వరదకాలువను 72 కోట్లతో ప్రారంభించాం. అప్పట్లో ప్రతి పక్షాలు రాజకీయ కక్షతో రైతులను ఎగదోసి కాలువను అడ్డుకున్నారు. ఆతరువాత మళ్ళీ రూ.138 కోట్లకు నిధులు పెంచి అలైన్‌మెంటు మార్చి 25 కోట్ల పనులు చేపడితే వైసీపీ ప్రభుత్వం వచ్చి పనులు నిలిపివేసింది. అమృత్ పథకంలో భాగంగా మైలవరం నుంచి తాగునీటి పైపు లైను రూ. 153 కోట్లతో పనులు మొదలు పెటి 25 శాతం వరకు పనులు పూర్తి చేశాము.రిజర్వాయర్ల నిర్మాణం కోసం స్థలాల సేకరణ చేపట్టాం. దానిని వైసీపీ ఎమ్మెల్యే అడ్డుకున్నారు. అపెరల్ పార్కు స్థలం 72 ఎకరాలలో టిడ్కో ఇళ్ళు నిర్మాణం చేపడితే ఎక్కడ టీడీపీకి మైలేజీ వస్తుందో అని ఆ ఇళ్ళపై రాచమల్లు కక్షపూరితంగా ఇంటింటికి దుష్ప్ర చారం చేశాడు. దాదాపు రెండు అపార్టు మెంటులు పూర్తయి 2వేలమందికి పైగా లబ్దిదారులను మొదటి విడతలో ఎంపిక చేశాము. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక టిడ్కో ఇళ్ళను రాచమల్లు రద్దుచేయించి ఆ విలువైన స్థలాలను అనుడాకు ఇచ్చి సెంటు 5 లక్షలు పేర ప్రభుత్వ విక్రయించి సొమ్ము చేసుకుంది. పేదలకు పనికిరాని భూములను సెంటు వంతున పట్టణానికి దూరంగా కట్టబెట్టింది. ప్రొద్దుటూరులో ఇప్పటివరకు కనపడే అభివృద్ధి అంతా నా హయాంలో నేను చేసింది మాత్రమే వుంది.

ఐదేళ్ళ వైసీపీ పాలనలో ప్రజలు సంతోషంగా వున్నారా ?

జ. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు చాలా సమస్యలు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా ఈ ఐదేళ్ళలో ఇంటిపన్నులు ప్రతిఏడాది మార్కెట్ వాల్యూపెరిగే మేరకు పన్నులు పెంచుతూ వెళ్ళారు. కరెంటు చార్జీలు విపరీతంగా మూడు, నాలుగు రెట్లు పెరిగాయి. బస్సు చార్జీలు పెంచారు. రిజిస్ట్రేషన్ స్టాంపుడ్యూటీలు పెంచారు. ఆఖరికి మద్యం నిషేధం అమలు చేస్తామని చెప్పి క్వార్టర్‌పై నాలుగురెట్లు ధరలు పెంచి నాసిరకం మద్యం విక్ర యించి వేల కోట్లు ఆర్జించారు. బియ్యం, కందిపప్పు,ఉప్పు,ఎర్రగడ్డలు, నూనెలు లాంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి,గ్యాసు ధర 400 నుంచి 1200 వందలకుచేరింది. వైసీపీ ఇచ్చే నవరత్నాల పథకాలు అనేక మందికి కోత పెట్టారు. కరెంటు బిల్లు, ఇంటి పన్ను ఎక్కువ వస్తుందనే పేరుతో పథకాలన్నీ కోత కోశారు. కౌలు రైతులకు రైతు భరోసాలేదు. డ్రిప్పు ఇరిగేషన్‌కు సబ్సిడీలు పూర్తిగా ఎత్తేయడంతో మెట్టప్రాంతాల్లో వ్యవసాయం పూర్తిగా బీడు పడింది. ఆరోగ్యశ్రీకి నిధులు ఇవ్వక పోవడంతో ఎక్కడా ఉచిత వైద్యం అందిందిలేదు. ప్రచారం యావ పెరిగింది. దీంతో ప్రజలు ఆ పార్టీని అసహ్యించుకునే పరిస్థితి వచ్చింది.

మళ్ళీ గెలిపిస్తే ప్రొద్దుటూరుకు ఏం చేయబోతున్నారు?

జ. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా నన్ను గెలిపిస్తేభూదందాలు, ఇసుక దోపిడీ, అసాంఘిక నేరాలను అరికడతాం. ప్రశాంత ప్రొద్దుటూరుగా మార్చి వ్యాపార, వాణిజ్య, ఆధ్యాత్మిక, సాహిత్య, కళారంగాలకు పూర్వ వైభవాలను తీసుకొస్తాం. ప్రొద్దుటూరుకు శాశ్వత తాగునీటి వసతికోసం రాజుపాళెం, పొద్దుటూరు రైతుల కోసం కుందూ పెన్నా అనుసందాన వరదకాలువను పూర్తిచేయిస్తాం. మురుగునీటి శుద్ధి ప్లాంటును ఏర్పాటుచేసి దోమలు లేని ప్రొద్దుటూరుగా పరిశుభ్రపట్టణంగా తీర్చిదిద్దుతాం. 3 లక్షల జనాభా తాగునీటి అవసరాలు తీర్చే పెన్నా నదిలో ఇసుకను కాపాడి భూగర్భ జలాలనుపరిరక్షిస్తాం. పారిశ్రామిక వాడలను అభివృద్ధి పరిచి చిన్న మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు కృషిచేస్తాం. ప్రొద్దుటూరుకు మెడికల్ కాలేజీ తీసుకువస్తాం. ప్రొద్దుటూరును విస్తరించి కార్పొరేషన్‌గా మార్చి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ నిధులతో రాయలసీమలోనే గొప్ప సుందర నగరంగా తీర్చిదిద్దుతాం.మురికి వాడలను దత్తత తీసుకుని అభివృద్ధిచేస్తాం. దీంతో పాటు టీడీపీ మేనిఫెస్టోలోని అన్ని పథకాలను రాజకీయాలకు అతీతంగా అమలు చేస్తాం. ఇంటింటికీ సంక్షేమాన్ని అందించి ఉపాధికల్పనలు మెరుగుపరుస్తాం. ప్రొద్దుటూరు ప్రజల మనస్సుల్లో వున్న భయాలను పొగొట్టి స్వేచ్ఛా, స్వతంత్రంగా జీవించేలా పాలన సాగిస్తాం. పారదర్శకపాలన అందిస్తాం.

కన్నుల పండువగా సీతారాముల కల్యాణం



ప్రొద్దుటూరులో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 17: శ్రీరామనవమి పండుగ సందర్భంగా పట్టణంలోని వివిధ రామాలయాల్లో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాదం పంపిణీ చేశారు. శివాలయంలోని అభయ వరద సీతారామచంద్రస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 11.30 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. కాగా పట్టణంలోని బంగారయ్య కొట్టాలులో ఉన్న సీతారాములస్వామివారి ఆలయాన్ని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి స్వామివారికి పూజలు నిర్వహించి సీతారాముల కల్యాణం ఆయన తిలకించారు.

ఎర్రగుంట్ల..: శ్రీరామనవమి సందర్భంగా బుధవారం సీతారాముల కల్యాణోత్సవం మండలంలో వైభవంగా నిర్వహించారు. భక్తులకు వడపప్పు, పానకం, లడ్డూ ప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించారు. మండలంలోని చాలా గ్రామాల్లో సీతాముల కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు.

బద్వేలు..: శ్రీరామ నవమి పురస్కరించుకుని బద్వేలు నియోజకవర్గ వ్యాప్తంగా బుధవారం శ్రీరామనవమి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. మేళ, తాళాలతో స్వామివారి కళ్యాణం నిర్వహించారు. అనంతరం పానకం, వడపప్పు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం భక్తులు నిర్వహించారు.

మైదుకూరు రూరల్..: మైదుకూరు మున్సిపాలిటీ, మండలంలో బుధవారం శ్రీసీతారాముల కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక అమ్మవారిశాలలో సీతారాముల కళ్యాణం ఘనంగా జరిగింది. కల్యాణానికి టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ వచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మునిరామయ్య దేవాలయం ,పాతూరులోని రామాలయం, పార్వతీనగరంలోని రామాలయం తదితర ఆలయాలలో కల్యాణ వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు.

రాజుపాలెం..: శ్రీరామనవమి సందర్భంగా టంగుటూరు గ్రామంలో బుధవారం కోదండ రామస్వామి దేవాలయంలో కల్యాణాన్ని వైభవంగా చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలుఏర్పాటు చేసి ఊరేగించారు. కార్యక్రమంలో వెంకటసుబ్బారెడ్డి , కె.సుబాష్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, పారాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..:మండలంలోని చల్లగిరిగెల, కోదండ రామస్వామి దేవాలయంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ బీజేపీ అభ్యర్థిబొజ్జ రోశన్న దంపతులు, ప్రతాప్ పూజా కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మండలంలో అన్ని రామాలయాల్లో పూజలు నిర్వహించారు.

కాశినాయన..:మండల వ్యాప్తంగా బుధవారం శ్రీరామ నవమి పండుగను ప్రజలు ఘనంగా సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. పండుగలో భాగంగా రాముల వారి దేవాలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు,భజనలు, సీతారాముల కల్యాణం ఏర్పాటుచేశారు. రాత్రి సీతారా ముల గ్రామోత్సవం నిర్వహించారు. కాగా బద్వేల్ టీడీపీ యువ నేత రితీష్‌రెడ్డి బాలాయపల్లె,కోడిగుడ్లపాడు గ్రామాల్లో నిర్వహించిన సీతారాముల కళ్యాణంలో పాల్గొని స్వాములవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రాజారెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, హోండా రవీంద్రారెడ్డి,ఓ.రోహిత్‌రెడ్డి, ఎల్.శ్రీనివాసులరెడ్డి,నర్శిరెడ్డి,డి.క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించండి

కొండాపురం, ఏప్రిల్ 17 : రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి తరపున జమ్మలమడుగు ఎమ్మెల్యేగా ఆదినారాయణరెడ్డిని, కడప ఎంపీగా భూపేశ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండల బీజేపీ ఇన్‌చార్జి దేవగుడి శివనారాయణరెడ్డి కోరారు. మండలంలోని ఏటూరు గ్రామంలో బుధవారం ఆయన ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కూటమి నాయకులు గండ్లూరు నాగేశ్వరరెడ్డి,రమణారెడ్డి,నరసింహారెడ్డి,పద్మజ, ప్రత్యూష, నరసింహా పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కండి: పుట్టా ఆనంద్ యాదవ్

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 17 : మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో మైదుకూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకరయాదవ్ సోదరుడు బి.మఠం ఎన్నికల ప్రచార సమన్వయ కర్త పుట్టా ఆనంద్‌యాదవ్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగాటీడీపీ నేతలతో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు దగ్గరలో ఉన్నాయని, ప్రతి ఒక్క టీడీపీ కార్యకర్త, నాయకుడు కష్టపడి పనిచేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నేతలు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, ముడుమాల పోలిరెడ్డి, ఎస్ఆర్ శ్రీనివాసులరెడ్డి, వెల్లటూరు సాంబశివారెడ్డి చిలమల నారాయణ, చిలమల నాగయ్య, సుబ్బరాయుడు, సుబ్రమణ్యం, ప్రముఖ న్యాయవాది పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా యువకుడు మృతి

మైలవరం, ఏప్రిల్ 17: జమ్మలమడుగు-తాడిపత్రి ప్రధాన రహదారిలోని వద్దిరాల సమీపంలో బుధవారం కడ్డీలతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తాపడి పెంక్ ఇమాంబాషా (32) మృతి చెందినట్లు తలమంచిపట్నం ఎస్ఐ హనుమంతు తెలిపారు. తలమంచిపట్నం పోలీసుల వివరాల మేరకు జమ్మలమడుగులో నివసిస్తున్న ఇమాంబాషా ట్రాక్టర్ ట్రాలీలో ఇనుప కడ్డీలు లోడ్ వేసుకుని వద్దిరాల వైపు నుంచి జమ్మలమడుగుకు బయలుదేరారు. జమ్మలమడుగు తాడిపత్రి రహదారిలో అదుపుతప్పి బోల్తా పడడంతో ట్రాలీలో కడ్డీల పైన కూర్చున్న ఇమాంబాషా ట్రాలీ కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన సంఘటనపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఇమాంబాషా మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య నూర్జహాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు.

పలువురు టీడీపీలో చేరిక



పుట్టా సమక్షంలో టీడీపీలో చేరిన అర్థాకుల వీరయ్య

దువ్వూరు (మైదుకూరు రూరల్) ఏప్రిల్17 : దువ్వూరు మండలంలోని సింగిల్ విండో మాజీ డైరెక్టర్ అర్థాకుల వీరయ్య వారి అనుచర బృందం బుధవారం మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ప్రొద్దుటూరులోని పార్టీ కార్యాలయంలో టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు నరసింహ రాయల్ చొరవతో వీరయ్య వారి అనుచరులు సుమారు 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో అర్థాకుల వీరాంజినేయులు,చెన్నశెట్టి చంద్ర మోహన్,తోట పెద్దసుబ్బయ్య,శంకరాచారి, బ్రహ్మయ్య, నరసింహులు,గండ్లూరి వెంకటరమణ, లంకెట రామ క్రిష్ణ,కోనేటి చంద్రశేఖర్,షేక్ బాబాజీ,పవన్,ఆవుల శ్రీను, సాయి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో బోరెడ్డి వెంకటరమణా రెడ్డి,రాంబాబు,గడ్డం ప్రసాద్‌శెట్టి,కాటారి కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్..:పట్టణంలోని మున్సిపాలిటీ 12వ వార్డు లో బుధవారం ప్రముఖ ఆయుర్వేద నిపుణుడు తేలు మందు షరీఫ్ వారి కుటుంబ సభ్యులు, అనుచరులు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో టీడీపీలో చేరారు. కాగా సాయంత్రం గంజికుంట పంచాయతీలోని నల్లపురెడ్డిపల్లెలో ఎన్నికల ప్రచారం జరిగింది.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, బీజేపీ ఇన్‌చార్జ్ మాచనూరు సుబ్బరాయుడు,జనసేన ఇన్‌చార్జ్ మల్హోత్ర,పార్టీ మండలాధ్యక్షుడు భీమయ్య, అమీర్,రాకేట్ రఫీ,అక్బర్,మాజీ సర్పంచ్ బీఎన్ శ్రీనివాసులు,న్యాయవాది ఆర్ శ్రీను,మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ శ్రీనివాసులు,కొండపల్లి ఉమాకాంత్,యాపరాల చిన్నా,బురుగోళ్ల చిన్నా,యుగంధర్, ముడియంప్రసాద్, మాచనూరు సుబ్బరాయుడు, వెన్నపూస ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాలకు అండగా టీడీపీ

ఖాజీపేట, ఏప్రిల్ 17: బడుగు, బలహీన వర్గాలకు అండగా టీడీపీ ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర ముస్లిం మైనార్టీ మాజీ కార్యదర్శి సిద్దారం కదిరుల్లా, టీడీపీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మీరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని బీసీ కాలనీ, చెర్లోపల్లె రోడ్డు, శ్రీనివాసనగరం, కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి, హబీబ్, హర్షద్, జాఫర్, గౌస్‌లాజం, ఆసీఫ్, కేకే బ్రదర్స్ యాస్మిన్‌బాను, షమీన్‌బాను, పాతిమా, సన, షామియా, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వీరయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

అట్లూరు, ఏప్రిల్ 17 : చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి అని అట్లూరు మండలంలోని జి.కొత్తపల్లె, కుంభగిరి ఎస్టీ కాలనీలో బుధవారం మండల టీడీపీ నాయకులు ప్రచారం చేశారు. టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, కడప టీడీపీ మహిళా పార్లమెంటరీ అధ్యక్షురాలు పాలకొండ సుధారాణి, మండల ఎంపీపీ ఇన్‌చార్జ్ రెడ్డయ్య, లక్కిరెడ్డి నారాయణరెడ్డి, రాజశేఖర్ ఆధ్వర్యంలో బద్వేలు ఉమ్మడి బీజేపీ అభ్యర్థి బొజ్జ రోశన్నకు కమలం గుర్తుకు, ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డికి సైకిలు గుర్తుకు ఓటు వేయాల న్నారు. ఈ కార్యక్రమంలో రాజగోపాల్ రెడ్డి, మద్దిక పుల్లారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, కె.శివ. కొండూరు గోపాల్‌రెడ్డి, నడిఓబయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు అరాచకమల్లును ఓడించండి : వరద




ప్రొద్దుటూరు, ఏప్రిల్ 17 : రాష్ట్రంలో సైకో జగన్‌ను, ప్రొద్దుటూరులో అరాచక మల్లును ఓడించాలని టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం 14 వవార్డు శ్రీనివాసనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి సానా విజయభాస్కర్‌రెడ్డి పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, దేవగుడి వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జ్ ఛైర్మెన్ వీఎస్ ముక్తియార్, మాజీ కౌన్సిలర్‌టప్పా మహబూబ్‌బాషా, అంజుమన్ అధ్యక్షుడు బొల్లవరం బాషా, నల్లబోతుల నాగరాజులు పాల్గొన్నారు.

'కరువు వచ్చినా పట్టించుకోని ప్రభుత్వం అవసరమా.?'

రాజుపాలెం, ఏప్రిల్ 17 : గత ఏడాది వర్షాలు పడక కరువు వచ్చినా రైతులను పట్టించుకోని ప్రభుత్వం మనకు అవసరమా అని ప్రొద్దుటూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి విమర్శించారు. బుధవారం సాయంత్రం అయ్యవారుపల్లె మండల కేంద్రమైన రాజుపాలెం గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. నంద్యాల వరదరాజులరెడ్డి తనయుడు కొండారెడ్డి ఇంటింటికీ తిరిగి సైకిలు గుర్తుపై ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజ జడ్పీటీసీ సభ్యుడు తోట మహేశ్వర్‌రెడ్డి, సానా వెంకటసుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, శివగోపాల్‌రెడ్డి, రామచంద్రరెడ్డి, జయరామిరెడ్డి, క్రిష్టారెడ్డి, కేశవరెడ్డి, కొట్టాల జగన్‌మోహన్‌రెడ్డి, ఖాదర్‌బాషా, ముక్తియార్, చదిపిరాళ్ల వేణుగోపాల్‌రెడ్డి టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఆది, భూపేశ్‌రెడ్డి

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 17: రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమిలో ఉన్న పార్టీ కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని కడప ఎంపీ అభ్యర్థి సి.భూపేశ్‌రెడ్డి, జమ్మలమడుగు ఎన్డీయే అభ్యర్థి సి.ఆదినారా యణరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఎర్రగుంట్ల టీడీపీ కార్యాలయ ఆవరణలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ ఎర్రగుంట్ల మున్సిపాలిటీలోని 20 వార్డులో ప్రచారాన్ని ఏవిధంగా నిర్వహించాలన్న విషయంపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాజేష్‌రెడ్డి, జగదీష్, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

24గంటల్లోనే తిరిగి టీడీపీలో చేరిన తెలుగుతమ్ముళ్లు



బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 17 : మండలంలోని దిరసవంచ పంచాయతీ పెద్దిరాజుపల్లె గ్రామానికి చెందిన జె.జయరాములు, జె.వెంకటరెడ్డి, ఎస్.శ్రీనివాసులు, కె.శ్రీనివాసులు,జి.మస్తాన్‌వారి అనుచర వర్గం మంగళవారం వైసీపీలో చేరారు. కానీఆ నేతలు తిరిగి బుధవారం సింగిల్‌విండో సొసైటీ మాజీఅధ్యక్షుడు కేవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు.

'నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా'

పోరుమామిళ్ల, ఏప్రిల్ 17 : తనకు ఒక్కసారి అవకాశం కల్పించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థి బొజ్జా రోశన్న అన్నారు. బుధవారం ఆయన పోరుమామిళ్లలోని బెస్తవీధి, జయరామరెడ్డి హాస్పిటల్ వీధి, గ్రీన్‌పార్కు లేన్, ఓల్డ్ పోస్టాఫీసు వీధి, 56,59కి సంబంధించిన పోలింగ్ బూత్ పరిధిల్లోని ఏరియాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో కుంటుపడిన అభివృద్ధి

ప్రొద్దుటూరు,ఏప్రిల్ 17 : వైసీపీ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని మాజీ ఎంపీపీ రామవరెడ్డి, సర్పంచ్ శివచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం సోముల వారిపల్లెలోని ఈశ్వరరెడ్డినగర్‌లో 8,9,10వార్డులలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు వంగనూరు మురళీధర్ రెడ్డి, వైఎస్ మహ్మద్‌గౌస్ తదితరులు పాల్గొన్నారు.

classified ఆంధ్రజ్యోతి lines

బంగారం కొనబడును
మీబంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మాద్యుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డ్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రది 7382114647
AJA-176986

యూనిట్ కార్యాలయం
9985411183
9985411189

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి